# తొలివార్త
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

www.tolivaartha.com

www.epaper.tolivaartha.com

ప్రచురణ : రంగారెడ్డి    ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్    సంపుటి : 02    సంచిక : 129    వెల : 4/-    పేజీలు : 08    ఆదివారం 13 - 09 - 2026

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial









## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి
- మండపాల నిర్వాహకులు పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సూచన
- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం

**తొలివార్త, హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. - మిగతా 2 లో

## హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- మంత్రి శ్రీధర్‌బాబు
- హైదరాబాద్‌కు సంబంధించిన క్యూర్-2026 బిల్లును మంత్రి శ్రీధర్ బాబు శాసనసభలో ప్రవేశపెట్టారు
- రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు.
- బెంగుళూరు, ముంబై, ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ మహా నగరపాలిక సంస్థ చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక



**తొలివార్త, హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు-2026ను మంత్రి శ్రీధర్‌బాబు శాసన సభలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బిల్లు తెచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టంలో మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడే విధంగా చేయాలనే ఉద్దేశంతో మూసీ పునరుజ్జీవం చేపట్టామని తెలిపారు. బెంగుళూరు, ముంబై, ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ మహా నగరపాలిక సంస్థ చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్ విస్తరణ పెద్ద ఎత్తున జరుగుతోందని, రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం తీసుకువచ్చినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయాలని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ రూపొందించుకుని ముందుకెళ్తున్నామని వివరించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ - మిగతా 2 లో

## నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదు, గతంలో ఉన్నదే



- మంత్రి పొంగులేటి
- ధరణి పోర్టల్ అడ్డుపెట్టుకుని గత పాలకులు వేలాది ఎకరాలు చెరబట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు
- 22ఏపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు.
- అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం

**తొలివార్త, హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదని, గతంలో ఉన్నదేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి - మిగతా 2 లో

## చేతులు కలిపిన మోదీ, పుతిన్, జిన్‌పింగ్



- ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ప్రత్యేక దృశ్యం
- రష్యా, చైనా అధ్యక్షులతో చేతులు కలిపిన ప్రధాని మోదీ
- ఏడేళ్ల తర్వాత భారత్‌లో పర్యటిస్తున్న జిన్‌పింగ్
- 'న్యూఢిల్లీ డిక్లరేషన్' ఆమోదించిన బ్రిక్స్ దేశాలు
- గ్లోబల్ సౌత్ పాత్ర పెరగాలని పిలుపునిచ్చిన మోదీ

**తొలివార్త,ఢిల్లీ, సెప్టెంబర్ 12 :** భారత ఆతిథ్యమిస్తున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఒక ఆసక్తికర సన్నివేశం అందరి దృష్టిని ఆకర్షించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో కలిసి ఉన్న ఒక ఫొటోను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. "ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు 2026 ప్రారంభమైంది" అనే క్యాప్షన్‌తో ఆయన ఈ పోస్ట్ చేశారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముగ్గురు అగ్రనేతలు ఎంతో స్నేహపూర్వకంగా కనిపించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటిస్తుండటం గమనార్హం. ఆయన శనివారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకోగా, పుతిన్ అంతకుముందే శుక్రవారం భారత్‌కు చేరుకున్నారు. ప్రధాని మోదీ పంచుకున్న ఇతర చిత్రాలలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో కూడా ఉన్నారు. భారత్ అధ్యక్షతన నిర్వహిస్తున్న 18వ బ్రిక్స్ - మిగతా 2 లో

## 25,000 క్యాబ్ డ్రైవర్ల సమ్మె

- శంషాబాద్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నిలిచిపోయిన క్యాబ్ సేవలు
- సమ్మె బాట పట్టిన సుమారు 25,000 మంది డ్రైవర్లు
- ప్రభుత్వ జీవో 46 అమలు చేయాలని ప్రధాన డిమాండ్
- ఓలా, ఉబెర్, రాపిడో ఎయిర్‌పోర్ట్ రైడ్స్‌ను బహిష్కరించిన యూనియన్
- కిలోమీటర్‌కు రూ. 21 బదులు రూ. 12 మాత్రమే ఇస్తున్నారని ఆరోపణ



**తొలివార్త, హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో క్యాబ్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నుంచి దాదాపు 25,000 మంది క్యాబ్ డ్రైవర్లు సమ్మె చేపట్టారు. ఓలా, ఉబెర్, రాపిడో వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను డ్రైవర్లు పూర్తిగా బహిష్కరించారు. ప్రభుత్వం 2022 డిసెంబర్ 9న జారీ చేసిన జీవో 46ను తక్షణమే అమలు చేయాలన్నది డ్రైవర్ల ప్రధాన డిమాండ్. ఈ జీవో ప్రకారం, ఎయిర్‌పోర్ట్ ప్రీపెయిడ్ సర్వీసులకు కిలోమీటరుకు రూ. 21 చొప్పున ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం తమకు కిలోమీటరుకు కేవలం రూ. 12 నుంచి రూ. 15 మాత్రమే అందుతున్నాయని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఆరోపించారు. ఈ అంశంపై ఆగస్టు 31న కార్మిక శాఖ జాయింట్ - మిగతా 2 లో



2 లో

## ఆ ఏడు దశల వెరిఫికేషన్ ఏమైంది

- డీఎస్సీపై ప్రభుత్వాన్ని నిలదీసిన జగన్
- మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జగన్
- ఏడు దశల తనిఖీ అంటున్నా అక్రమాలు ఎలా జరిగాయని విమర్శ
- నకిలీ ఖోఖో సర్టిఫికెట్లు, జరగని క్రీడాపోటీల అంశాలను ప్రస్తావించిన వైనం
- నియామక ప్రక్రియపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్

## వేలంలో కోట్లు పలికిన 130 ఏళ్ల నాటి అరుదైన నాణెం




- 1894-ఎస్ బార్బర్ డైమ్ వేలంలో రూ.10 కోట్లకు పైగా ధర
- 24 నాణేలను మాత్రమే ముద్రించిన శాన్ ఫ్రాన్సిస్కో మింట్
- ప్రస్తుతం మనుగడలో 9 నాణేలు
- 36 ఏళ్ల తర్వాత మార్కెట్లోకి రావడంతో ఈ నాణేనికి భారీ ధర

**తొలివార్త,ఢిల్లీ, సెప్టెంబర్ 12 :** ఒకప్పుడు కేవలం 10 సెంట్ల (సుమారు రూ. 8) విలువ కలిగిన ఒక చిన్న నాణెం, నేడు కోట్లాది రూపాయల విలువైన మహా సంపదగా మారింది. అమెరికాకు చెందిన అత్యంత అరుదైన '1894-ఎస్ బార్బర్ డైమ్' నాణెం ఇటీవల జరిగిన వేలంలో ఏకంగా - మిగతా 2 లో

## ఏపీ వైద్యరంగానికి డబుల్ ఇంజిన్ బలం

- రూ.249 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించిన నడ్డా, చంద్రబాబు
- విజయవాడలో నడ్డా, చంద్రబాబు పర్యటన
- రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి 500 క్రిటికల్ కేర్ బెడ్లు
- త్వరలో 'సంజీవని' ప్రాజెక్టు ప్రారంభిస్తామన్న సీఎం చంద్రబాబు
- అమరావతి బయో క్వాంటం వ్యాలీకి జాతీయ హోదా కోరిన సీఎం
- డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే అభివృద్ధి సాధ్యమైందన్న చంద్రబాబు



**తొలివార్త, అమరావతి, సెప్టెంబర్ 12 :** ఆంధ్రప్రదేశ్‌లో వైద్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ముందడుగు వేశాయి. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విజయవాడలో పర్యటించి, రాష్ట్రవ్యాప్తంగా రూ. 249 కోట్ల వ్యయంతో నిర్మించిన 22 ఆరోగ్య ప్రాజెక్టులను సంయుక్తంగా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర, అత్యాధునిక వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చారు. విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ (ఐపీహెచ్) ల్యాబొరేటరీలను నడ్డా, చంద్రబాబు నేరుగా ప్రారంభించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఐపీహెచ్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లతో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ - మిగతా 2 లో

## ఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

- బ్రిక్స్ ఢిల్లీ డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- విభేదాలు పక్కనపెట్టి ఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపిన అరబ్ దేశాలు
- ఐరాస భద్రతామండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ సంస్కరణలకు మద్దతు
- ఏకపక్ష ఆంక్షలు, సుంకాలు, రక్షణాత్మక వాణిజ్య విధానాలకు వ్యతిరేకత
- గాజాలో కాల్పుల విరమణ, మానవతా సాయం కొనసాగాలని డిమాండ్
- జమ్మూకశ్మీర్ ఉగ్రదాడిని ఖండిస్తూ ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం



**తొలివార్త,ఢిల్లీ, సెప్టెంబర్ 12 :** న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సులో సభ్య దేశాలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. ప్రపంచ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాధాన్యం కల్పించాలని న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో పిలుపునిచ్చాయి. ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలకు అంతర్జాతీయ సంస్థల్లో ఎక్కువ ప్రాతినిధ్యం ఉండాలని స్పష్టం చేశాయి. ప్రపంచ వ్యవస్థ మరింత ప్రజాస్వామ్యబద్ధంగా, బహుళ ధ్రువంగా మారాలని బ్రిక్స్ నేతలు ఆకాంక్షించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సంస్కరణలకు బ్రిక్స్ మరోసారి మద్దతు తెలిపింది. భారత్, బ్రెజిల్‌కు ఐరాసలో, ముఖ్యంగా భద్రతామండలిలో, మరింత కీలక పాత్ర కల్పించాలన్న ఆకాంక్షలకు చైనా, రష్యా మద్దతు తెలిపిన విషయాన్ని ప్రకటనలో స్వాగతించారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ - మిగతా 2 లో

# సంపాదకీయం

## సమష్టి స్వరం సాధ్యమేనా!



రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఇరాన్‌తో అమెరికా లడాయి, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు వగైరాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్ని ఊపిరాడకుండా చేస్తున్న తరుణంలో న్యూఢిల్లీలో శని, ఆదివారాల్లో బ్రిక్స్ దేశాల 18వ శిఖరాగ్ర సదస్సు జరగబోతోంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు ఇప్పటికే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ రాగా... చైనా అధ్య క్షుడు షీ జిన్‌పింగ్ శనివారం చేరుకుంటారు. ఆయన ఏడేళ్ల తర్వాత మన దేశం వస్తున్నారు. ఇక ఇరాన్ అధ్యక్షుడొకరు భారత్‌కొచ్చి ఎనిమిదేళ్లవుతుండగా, పెజెష్కియాన్ అడుగుపెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీతో పుతిన్ ద్వైపాక్షిక సమావేశం జరగటం,ఆ వెంటనే పెజెష్కియాన్ కూడా ఆయనతో ద్వైపాక్షిక భేటీ కావటంతో పాటు, తదనంతరం జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరం సమావేశంలో కూడా పాలుపంచుకోవటంతో దౌత్య సందడి ముందే మొదలైనట్టయింది.ఆవిర్భవించిననాడు బ్రిక్స్‌వి బుడి బుడి అడుగులే. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాల విదేశాంగమంత్రులు 2006లో తొలిసారి సమావేశమై కూటమిగా ఏర్పడాలని నిర్ణయించారు. 2009లో తొలి శిఖరాగ్ర సమావేశం జరిగింది. దక్షిణాఫ్రికా 2011లో చేరాక చివరిలో 'ఎస్' చేరి బ్రిక్స్ అయింది. అటుపై వరసగా ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇండొనేసియాలు వేర్వేరు సంవత్సరాల్లో చేతులు కలిపాయి. మొత్తంగా ఇది 20 దేశాల కూటమిగా రూపొందింది. ప్రపంచ జనాభాలో బ్రిక్స్ దేశాల వాటా 49.5 శాతం. ప్రపంచంలోని నాలుగోవంతు భూభాగం దీని సొంతం. ప్రపంచ జీడీపీలో దాదాపు 30 శాతం వాటా. వాణిజ్య ఎగుమతుల్లో 21.6 శాతం, దిగుమతుల్లో 17.3 శాతం వాటా ఈ దేశాలదే. ప్రపంచ ఇంధన ఉత్పత్తిలో బ్రిక్స్ వాటా 40 శాతం. కొనుగోలు శక్తిలో జీ7 దేశాలకన్నా బ్రిక్స్ దేశాలదే అధికం. ప్రపంచ బ్యాంకుకు ప్రత్యామ్నాయంగా పేద దేశాలకు తోడ్పడే సుస్థిర పట్టణాభివృద్ధి ప్రణాళిక, మౌలిక సదుపాయా లపై సూచనలివ్వటం, వాటి వ్యయానికి నిధులు సమకూర్చటం తదితరాలను చైనాలోని షాంఘైలో ప్రధాన కార్యాలయం ఉన్న బ్రిక్స్‌కు చెందిన న్యూ డెవెలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) చూస్తోంది. సభ్యదేశాల జాతీయ కరెన్సీల్లో వాణిజ్యం నెరపుతూ డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవటం, చెల్లింపులకోసం స్విఫ్ట్ వంటి పేమెంట్ విధానంలోకాక 'బ్రిక్స్ పే' ద్వారా లావాదేవీలు జరపటం ఇప్పటికే మొదలయ్యాయి. ఇన్నివిధాల సహాయ సహకారాలు కొనసాగే బ్రిక్స్ ఎప్పటికీ ఇలాగే కొనసాగుతుందా అనే సంశయం చాలా మందికి ఉంది. ఎందుకంటే ఈ కూటమిలోని దేశాలే వేరే కూటముల్లో ఉన్నాయి. సౌదీ అరేబియా, యూఏఈ అమెరికా కనుసన్నల్లో నడుస్తాయి. పశ్చిమాసియా యుద్ధంలో అమెరికాకు సహకరిస్తూ ఇరాన్‌కు వ్యతిరేకంగా ఉన్నాయి. భారత్, చైనాల మధ్య సరిహద్దు వివాదాలు సరేసరి. అయితే ఆగిపోవటం కన్నా అడుగు ముందుకేయటమే అందరికీ ప్రయోజనకరం. కలిసి పనిచేసే సంస్కృతి పెంపొందటంవల్ల అపోహలు తొలగే అవకాశం ఉంటుంది. దగ్గరయ్యేందుకు వీలుంటుంది. సమష్టి కార్యా చరణ అవసరమైన రంగాలు చాలానే ఉన్నాయి. ఉగ్రవాదం, సైబర్ సెక్యూరిటీ, ఐక్యరాజ్యసమితిని బహుళ ప్రాతినిధ్య సంస్థగా చేయాలన్న డిమాండ్ వగైరాల్లో ఈ దేశాలు సమష్టిగా పనిచేయొచ్చు. వాతావరణం, విద్య, ఇంధనం, డిజిటల్ పేమెంట్ వేదికలు వగైరాల్లో సహకరించుకోవచ్చు. అలాగని కల్లోల కాలంలో కూటములు మనుగడ అంత సులభమేమీ కాదు. తమపై అమెరికా ప్రకటించిన దురాక్రమణ యుద్ధాన్ని బ్రిక్స్ ఖండించాలని ఇరాన్ బలంగా కోరుకుంటోంది.అదే సమయంలో తమపై ఇరాన్ సాగిస్తున్న దాడుల్ని కూడా వ్యతిరేకించాలని సౌదీ, యూఏఈ ఆశిస్తాయి. అందుకే బ్రిక్స్ ఉమ్మడి ప్రకటన అంత సులభమేమీ కాదు. ఇటీవల బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు నేరుగా అమెరికానూ, ఇజ్రాయెల్‌నూ ప్రస్తావించకుండా ఇరాన్‌పై దాడిని ఖండించింది. అక్కడైతే సౌదీ, యూఏఈ సభ్యదేశాలు కాదు. ఇక్కడ పరిస్థితి వేరు. ఈ సమస్యను బ్రిక్స్ ఎలా పరిష్కరించుకుంటుందో చూడాల్సివుంది. ఆ దేశాలకూ, ఇరాన్‌కూ మధ్య ఏదోమేర సామరస్యం సాధించగలిగితే, సమష్టి స్వరం వినిపించగలిగితే బ్రిక్స్ బలం మరింత పెరుగుతుంది.

# ఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

**మొదటిపేజీ తరువాయి -** సహా బ్రెట్టన్ వుడ్స్ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ఓటింగ్ హక్కు, నిర్ణయాధికారం పెరగాలని కోరారు. ఐరాసలో ఉన్నత పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం కూడా పెరగాలని పేర్కొన్నారు.ఏకపక్ష ఆర్థిక ఆంక్షలు, ఇతర దేశాలపై విధించే ద్వితీయ ఆంక్షలను బ్రిక్స్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇవి అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, ఆహార భద్రత, ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొంది. ఏకపక్ష సుంకాలు, పన్నేతర ఆంక్షలు, రక్షణాత్మక వాణిజ్య విధానాలు ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థలో వివాద పరిష్కార వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరింది. డబ్ల్యూటీవో అప్పిలేట్ బాడీలో కొత్త సభ్యుల నియామకానికి మద్దతు తెలిపింది.అంతర్జాతీయ వివాదాలకు యుద్ధం కాకుండా చర్చలు, దౌత్యం, మధ్యవర్తిత్వమే పరిష్కార మార్గాలని బ్రిక్స్ పేర్కొంది. గాజాలో కాల్పుల విరమణ కొనసాగాలని, మానవతా సాయం ఎలాంటి అడ్డంకులు లేకుండా అందాలని కోరింది. పాలస్తీనియన్లను బలవంతంగా తరలించడాన్ని ఆపాలని, పౌరులు, పౌర మౌలిక వసతులకు రక్షణ కల్పించాలని స్పష్టం



చేసింది.1967 సరిహద్దుల ఆధారంగా రెండు దేశాల పరిష్కారానికి మద్దతు తెలిపింది. తూర్పు జెరూసలేం పాలస్తీనా రాజధానిగా ఉండాలని పేర్కొంది. ఐరాసలో పాలస్తీనాకు పూర్తిస్థాయి సభ్యత్వానికి మద్దతు ఇచ్చింది. లెబనాన్‌లో కాల్పుల విరమణను స్వాగతిస్తూ ఐరాస తీర్మానం 1701 అమలు చేయాలని కోరింది.సూడాన్‌లో తక్షణమే శాశ్వత కాల్పుల విరమణ జరగాలని బ్రిక్స్ కోరింది. ప్రజలకు మానవతా సాయం అందించేందుకు అడ్డంకులు తొలగించాలని పేర్కొంది. సమస్యకు ఆఫ్రికా దేశాలే పరిష్కారం చూపాలన్న విధానాన్ని సమర్థించింది. సిరియాలో ఆ దేశ ప్రజల ఆధ్వర్యంలో, ఐరాస సహకారంతో రాజకీయ ప్రక్రియ కొనసాగాలని తెలిపింది. ఆక్రమణ దళాలు అక్కడి నుంచి వెళ్లిపోవాలని పిలుపనిచ్చింది.ఉగ్రవాదానికి ఎలాంటి మినహాయి ంపులు ఉండకూడదని బ్రిక్స్ స్పష్టం చేసింది. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని ఖండించింది. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్‌గావ్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఆ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఖండించింది. ఐరాసలో సమగ్ర అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక ఒప్పందాన్ని త్వరగా ఆమోదించాలని కోరింది.ఉగ్రవాదానికి నిధులు, మానవ అక్రమ రవాణా, ఆయుధాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు దేశాల మధ్య సహకారం పెరగాలని సూచించింది. డ్రగ్స్ ద్వారా జరిగే మనీలాండరింగ్, సైబర్ నేరాలు, అక్రమ వర్చువల్ ఆస్తుల లావాదేవీలపైనా దృష్టి పెట్టాలని పేర్కొంది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల నెట్‌వర్క్‌లను ఎదుర్కొనేందుకు సమన్వయం పెంచాలని తెలిపింది. ఆస్తుల రికవరీ, పరారీలో ఉన్న నిందితుల గుర్తింపు, సరిహద్దులు దాటి జరిగే అవినీతిని అడ్డుకునే కొత్త సహకార విధానాలను కూడా బ్రిక్స్ స్వాగతించింది.

## ఆ ఏడు దశల వెరిఫికేషన్ ఏమైంది?

**మొదటిపేజీ తరువాయి -** ఏపీ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ల పరిశీలనలో ప్రభుత్వం చెబుతున్న 'ఏడు దశల వెరిఫికేషన్' ప్రక్రియపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇన్ని దశల తనిఖీలు జరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ, అక్రమాలు వెలుగుచూడటాన్ని ఆయన ప్రశ్నించారు. ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం తేలికగా వ్యవహరిస్తోందని సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు.ఈ సందర్భంగా జగన్ కొన్ని నిర్దిష్ట ఘటనలను ఉటంకించారు. కొందరు విజేతల పేర్లు జాబితాలో గల్లంతవడం, కొన్ని సర్టిఫికెట్లు నకిలీవని స్వయంగా ఖోఖో క్రీడా సమాఖ్య అధికారులు చెప్పడం, ఒక అభ్యర్థి పేర్కొన్న క్రీడా ఈవెంట్‌ను తాము అసలు నిర్వహించలేదని నాగార్జున విశ్వవిద్యాలయం స్పష్టం చేయడం వంటి ఉదంతాలను ఆయన ప్రస్తావించారు."ఇన్ని అక్రమాలు బయటపడుతుంటే, అసలు ఎక్కడ, ఏం వెరిఫికేషన్ చేశారు?" అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇన్ని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నా, డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం ఎలా చెప్పగలదని ఆయన ప్రశ్నించారు.ఈ లోపాలే అక్రమాలకు ఆస్కారం కల్పించాయా అని సందేహం వ్యక్తం చేశారు. జరిగిన తప్పులకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో నెలకొన్న పరిస్థితులపై సమగ్రమైన వివరణ ఇవ్వాలని ఆయన కోరారు.కాగా, మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే ఉంది. అయితే, నిబంధనల ప్రకారమే నియామకాలు జరిగాయని, సర్టిఫికెట్ల పరిశీలన పలు దశల్లో పకడ్బందీగా నిర్వహించామని ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది.కొన్ని ఆరోపణలపై అధికారులు మీడియా సమావేశాల్లో వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ, తాజాగా జగన్ చేసిన వ్యాఖ్యలతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం చెబుతున్న పారదర్శకతకు, ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు మధ్య డీఎస్సీ ప్రక్రియ రాజకీయ వివాదంగా కొనసాగుతోంది.

## వేలంలో కోట్లు పలికిన 130 ఏళ్ల నాటి అరుదైన నాణెం

**మొదటిపేజీ తరువాయి -** 1,250,500 డాలర్లకు (సుమారు రూ. 10.4 కోట్లు) అమ్ముడుపోయింది. సెప్టెంబర్ 1న 'స్టాక్స్ బోవర్స్ గ్యాలరీస్' నిర్వహించిన ఈ వేలంలో పురాతన నాణేల సేకరణకారులు దీనిని దక్కించుకోవడం కోసం తీవ్రంగా పోటీపడ్డారు.ఈ నాణేనికి ఇంత భారీ ధర పలకడానికి ప్రధాన కారణం అది అత్యంత అరుదైనది కావడమే. 1894 జూన్‌లో శాన్ ఫ్రాన్సిస్కో మింట్ ఈ డిజైన్‌తో కేవలం 24 నాణేలను మాత్రమే ముద్రించింది. వాటిలో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కేవలం 9 నాణేలు మాత్రమే మనుగడలో ఉన్నాయని నిపుణులు ధ్రువీకరించారు. దీంతో అమెరికాలోని అత్యంత అరుదైన నాణేల జాబితాలో ఇది ఒకటిగా నిలిచింది. ఈ నాణేనికి ఒకవైపు 'లిబర్టీ' చిత్రం, మరోవైపు "వన్ డైమ్" అని రాసి ఉన్న పూలదండ మధ్యలో "ఎస్" అనే మింట్ గుర్తు ఉంటుంది.1893లో సంభవించిన తీవ్ర ఆర్థిక సంక్షోభం కారణంగా కొత్త నాణేలకు డిమాండ్ తక్కువగా ఉన్న సమయంలో వీటిని ముద్రించారు. అయితే, కేవలం 24 నాణేలనే ఎందుకు ముద్రించారనే అంశంపై భిన్న కథనాలు ఉన్నాయి. మిగిలిపోయిన కొద్దిపాటి లోహంతో వీటిని తయారు చేశారని కొందరు చెబుతుంటే, అప్పటి మింట్ సూపరింటెండెంట్ జాన్ డాగెట్ తన బ్యాంకర్ స్నేహితులకు బహుమతిగా ఇచ్చేందుకు వీటిని ప్రత్యేకంగా ముద్రించారని మరో కథనం ప్రచారంలో ఉంది. ఈ రహస్యమే ఆ నాణెం విలువను మరింత పెంచింది.ఈ నిర్దిష్ట నాణేనికి కూడా ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. ప్రముఖ నాణేల సేకరణ నిపుణుడు డేవిడ్ బోవర్స్ 1957లో తన 19వ ఏట దీనిని కేవలం 4,750 డాలర్లకు కొనుగోలు చేశారు. సుమారు 36 ఏళ్లుగా మార్కెట్లో ఎక్కడా కనిపించని ఈ నాణెం ఇప్పుడు వేలానికి రావడంతో భారీ ధర పలికింది. నాణేల కొరత, చారిత్రక ప్రాధాన్యం, దాని వెనుక ఉన్న నిగూఢ రహస్యం కలిసి ఒకప్పటి 10 సెంట్ల నాణేన్ని 130 ఏళ్ల తర్వాత కోట్లాది రూపాయల అరుదైన నిధిగా మార్చాయి.

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

**మొదటిపేజీ తరువాయి -** పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు."హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## 25,000 క్యాబ్ డ్రైవర్ల సమ్మె



**మొదటిపేజీ తరువాయి -** కమిషనర్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు, కంపెనీల యాజమాన్యాలతో కీలక సమావేశం జరిగింది. జీవో నిబంధనల ప్రకారం ఛార్జీలు చెల్లించాలని అధికారులు ఆదేశించినప్పటికీ, సదరు కంపెనీలు వాటిని బేఖాతరు చేశాయని యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది."మేము ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. మాకు దక్కాల్సిన చట్టబద్ధమైన ఛార్జీలతో పాటు వృత్తిపరమైన గౌరవం, సమానత్వం కావాలి" అని అన్నారు. ఈ సమస్యలపై సమగ్రంగా చర్చించి, లిఖితపూర్వక హామీ ఇచ్చేందుకు ప్రభుత్వం వెంటనే సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేయాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది.

## ఏపీ వైద్యరంగానికి డబుల్ ఇంజిన్ బలం



**మొదటిపేజీ తరువాయి -** సర్కార్ వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నడ్డా సహకారంతో రాష్ట్ర వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. "త్వరలోనే రాష్ట్రంలో 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాం. ఇది వైద్య రంగంలో ఒక గేమ్ ఛేంజర్ కానుంది. జనవరి 1 నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం" అని చంద్రబాబు కీలక ప్రకటన చేశారు.అమరావతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తోందని, లడ్డాఖ్‌లో కూడా అమరావతి గురించి చర్చించుకుంటున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. "అమరావతిలో ఏర్పాటు చేయనున్న 'బయో క్వాంటం వ్యాలీ'కి జాతీయ గుర్తింపు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాను. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ప్రారంభం కానుంది" అని కేంద్ర మంత్రి నడ్డాను అభ్యర్థించారు. ఆహారమే ఔషధంగా 'కిచెన్ ఫార్మసీ'ని ప్రోత్సహించాలని, ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం అలవర్చుకోవాలని సూచించారు. కేంద్రం సహకారం, రాష్ట్ర సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఏపీని 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

## చేతులు కలిపిన మోదీ, పుతిన్, జిన్‌పింగ్



**మొదటిపేజీ తరువాయి -** శిఖరాగ్ర సదస్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచ గమనాన్ని నిర్దేశించడంలో గ్లోబల్ సౌత్ దేశాలు ఇకపై వెనుకవరుసకే పరిమితం కాకుండా, నిర్ణయాధికారాల్లో కీలక భాగస్వాములు కావాలని ప్రధాని మోదీ తన ప్రారంభోపన్యాసంలో పిలుపునిచ్చారు. వివిధ అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ, శనివారం తెల్లవారుజాము వరకు జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు బ్రిక్స్ దేశాధినేతలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

# హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళుతున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. లక్ష్య సాధనకు హైదరాబాద్ మరింత అధునాతనంగా అంతర్జాతీయ స్థాయికి చేరాలని అన్నారు. ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలన్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి మనం ఎదగాలని పేర్కొన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ నినాదంతో రాష్ట్ర అభివృద్ధికి చర్యలున్నాయని గుర్తు చేశారు.'క్యూర్' తెలంగాణ ఆర్థిక ప్రగతికి అత్యంత కీలక ప్రాంతమని, రాష్ట్ర విస్తీర్ణంలో చిన్నదైనా తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో క్యూర్ పాత్ర పెద్దదని శ్రీధర్ బాబు వివరించారు. 2025-26లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, క్యూర్ పరిధిలో 10.7 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ సేవా రంగానికి సంబంధించి 68.6 శాతం వృద్ధి నమోదైందని అన్నారు. సేవా రంగం, పెట్టుబడులు, ఉపాధికి ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ఉందని అన్నారు. క్యూర్ పరిధి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ఆర్థిక ఉత్పత్తిలో తొలి 3 స్థానాల్లో



ఉన్నాయన్నారు. క్యూర్ ప్రాంతంలో పరిపాలన వ్యవస్థను భవిష్యత్ అవసరాల మేరకు పునర్నిర్మించాలన్నారు."కాలం చెల్లిన నిబంధనలు తొలగించాలని, భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే చట్టాన్ని తీసుకువచ్చే ఆలోచన చేశాం. ఈ క్యూర్ బిల్లులో ఐదు భాగాలు ఉన్నాయి. ఇందులో ఐదు భాగాలు, 43 చాప్టర్లు, 319 సెక్షన్లు, 9 షెడ్యూళ్లు ఉన్నాయి. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లకు ఒకే రకమైన చట్టం ఉంటుంది. దీనిలో ప్రజలకు సేవలు అందించే విధానాన్ని మాత్రమే మారుస్తున్నాం.హైదరాబాద్‌లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశామని శ్రీధర్ బాబు తెలిపారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టం పని చేస్తుందని అన్నారు. మూసీ పునరుజ్జీవం తొలి దశకు రూ.7,345. 12 కోట్లతో అనుమతులు తీసుకున్నట్లు వివరించారు. 20 టీఎంసీల గోదావరి జలాలు తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీని ట్రై కార్పొరేషన్లుగా విభజించుకున్నామని, అన్ని సంస్థలు సమన్వయంతో పని చేసేలా చట్టబద్ధ వ్యవస్థగా ఏర్పాటు చేస్తున్నామన్నారు.సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలక మండలి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహానగరపాలిక చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామన్నారు. మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగం చేసే దిశగా యోచన చేస్తున్నట్లు చెప్పారు. చెట్ల పెంపకం, కాలుష్య నివారణకు వాడాలనే ప్రభుత్వ ఆలోచనలు ఉన్నాయని, హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదు, గతంలో ఉన్నదే

**మొదటిపేజీ తరువాయి -** పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూములను బలమున్నవాడు కొల్లగొట్టకుండా తెచ్చిన చట్టమని వివరించారు. 22ఏ నిషేధిత జాబితా భూముల అంశంపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా మంత్రి పొంగులేటి సుదీర్ఘంగా మాట్లాడారు. 1995లో ఘట్కేసర్ రైల్వేస్టేషన్ భూమిని కూడా ఒకరికి రిజిస్ట్రేషన్ చేశారన్న మంత్రి పొంగులేటి, అలాంటి అక్రమాలు మళ్లీ జరగొద్దనే నిషేధిత భూముల జాబితా తెచ్చారన్నారు. మళ్లీ కేసీఆర్ హయంలో 2016లో కొత్తగా జీవో 121 జారీ చేశారని చెప్పారు. జీవో 121 తీసుకువచ్చి చాలామంది రైతులను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో ఒక్క ఎకరమూ చేర్చలేదని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.నిషేధిత జాబితాలో ఉండకూడని భూములు కొన్ని ఆనాటి నుంచి ఉన్నాయని పొంగులేటి వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనూ అదే కాపీని అప్‌లోడ్ చేశారన్నారు. దానిని అధికారులు ప్రింట్ తీసి మరోసారి అప్‌లోడ్ చేశారని వివరించారు. ఇక్కడే పొరపాటు జరిగిందని చెప్పారు. ఇది మొదటి నుంచీ జరిగిన పొరపాటని మంత్రి అసెంబ్లీలో వెల్లడించారు. ఉమ్మడి ఏపీ హయాం నుంచి వచ్చిన జీవోల ఆధారంగానే ఆ కాపీ రూపొందిందని పొంగులేటి గుర్తు చేశారు.గతంలో కొన్ని భూములను ప్రభుత్వం విక్రయించడం, ప్లాట్లు చేసి ఇవ్వడం జరిగిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విక్రయించిన భూములను అధికారులు పొరపాటున 22ఏలో చేర్చారన్నారు. అధికారులు చేసిన పొరపాటును యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతున్నామని చెప్పారు. నిషేధిత జాబితా నుంచి గతంలోనే తొలగిస్తూ ఇచ్చిన జీవో చూపితే వెంటనే తొలగిస్తున్నామన్నారు. ఒక్కరోజులోనే మ్యుటేషన్ చేయటం వల్ల ఎన్నో అక్రమాలు జరిగాయన్న పొంగులేటి, ధరణి పోర్టల్‌లో 80 మాడ్యూల్స్ పెట్టి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. ఇప్పుడు భూభారతి చట్టంలో 80 మాడ్యూల్స్‌కు బదులు కేవలం 5 మాడ్యూల్స్ పెట్టామన్నారు."దొరల పాలనలో పాసుపుస్తకాలు ఉండేవి కానీ, భూములు మాత్రం ఉండేవి కాదు. ధరణి చట్టం తెచ్చి తమ బంధువులు, రాజకీయ అనుచరులకు పాసుపుస్తకాలు ఇచ్చారు. భూమిలేకుండానే ఆ పాసుపుస్తకాలకు కోట్ల రూపాయల రైతుబంధు ఇచ్చారు. భూమిలేని వారికీ రైతుబంధు ఇచ్చి వేలకోట్ల ప్రజాధనం కొల్లగొట్టారు. అసలు అసెంబ్లీ ఇక్కడ నిర్వహిస్తుంటే మాక్ అసెంబ్లీ ఎందుకు అసెంబ్లీకి రాకుండా మాక్ అసెంబ్లీ పెట్టుకుని అక్కడ డ్రామాలు ఆడుతున్నారు.కోట్ల మంది రైతుల వివరాలను విదేశీ సంస్థ అయిన టెరాసిస్ చేతిలో పెట్టారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక, టెరాసిస్ సంస్థను తొలగించి కేంద్ర సంస్థ అయిన ఎన్ఐసీకి అప్పగించామన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవన్నారు. దాదాపు 125 ఏళ్ల



తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని పొంగులేటి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన గ్రామాల్లో ఇప్పటికే భూమి మొత్తం సర్వే చేసి రైతులకు పాసుపుస్తకాలు ఇచ్చామని తెలిపారు. వచ్చే ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పూర్తి చేసి రైతులకు మేలు చేస్తామని స్పష్టం చేశారు.ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకొని, గత పాలకులు అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా గత పాలకులు భావించారని ఆక్షేపించారు. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పులకు లక్షలాది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పోర్టల్‌లో తప్పుల నమోదు వల్ల వందల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌కు లాక్ అనే సిస్టమ్ పెట్టి అందరి భూములపై నిఘా పెట్టారన్నారు.

తొలివార్త

ఆదివారం 13 - 09 - 2026

# ఒకవైపు కిరాయిలు లేవు...
# మమ్మల్ని కనికరించండి మహా ప్రభో....

## ట్రాఫిక్ చలాన్లతో కన్నీరు.... మున్నీరు అవుతున్న ఆటో కార్మికులు



**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 11 (తొలి వార్త) :** తెలంగాణ రాష్ట్రంలో, ఆటో ల కు సరైన కిరాయిలు లేక వాటిని నడిపే పరిస్థితి లేకుండా ఉంది. ఆటో పై ఫైనాన్స్ కట్టలేక, కుటుంబాన్ని పోషించు కోవడానికి కూడా ఆటో డ్రైవర్ల పరిస్థితి ఇబ్బంది కరంగా మారింది,భద్రాచలంలో ఒకవైపు ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. పొద్దంతా ఆటో నడిపినా ఇంటికి తీసుకెళ్లేంత సంపాదన రావడం కష్టంగా ఉందని ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సులతో, ఇబ్బందుల వల్ల ఫైనాన్సులో తెచ్చుకున్న ఆటోలు సరైన కిరాయిలు, లేక, ఆటో కార్మికులు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, ట్రాఫిక్ పోలీసులు ఎక్కడపడితే అక్కడ ఆటోలను ఆపి టాప్ నంబర్, డ్రైవర్ చొక్కా లేదంటూ చలాన్లు వేస్తున్నారని ,కనీసం, చలాన, కూడా, వెంటనే, కట్టే పరిస్థితి లేదని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. కనీసం మమ్మల్ని కనికరించండి మహా ప్రభో.... అంటూ వేడుకుంటున్నారు... ఆటో డ్రైవర్లు విలేకరులతో మాట్లాడుతూ, కిరాయిలు లేక ఇల్లు గడవక కుటుంబం బతకడానికి చాలా ఇబ్బందికరంగా ఉందని వారు తెలుపుతూ, పోలీసులు మాత్రం చలానలు,కడితేనే ఆటోలు వదిలేస్తున్నారని, ఆటో డ్రైవర్, లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల టార్గెట్ల కోసం ఆటోలనే పైనా ఎక్కువగా, దృష్టి పెడుతున్నారని వారు వాపోతున్నారు. ప్రభుత్వంనీ, గానీ పోలీస్ శాఖ వారి,ని మేము వేడుకునేది ఏంటంటే, రోడ్డు భద్రత విషయంలో, ఆటోలో ప్రయాణికులను తరలించే విషయంలో నిబంధనలు ట్రాఫిక్ రూల్స్ నియమాలు పాటిస్తామని, తమ ఆటో కార్మికుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని చలాన్ల విషయంలో మానవతా దృక్పథంతో చూడాలని వారు కోరుతున్నారు.

# నకిరేకల్ లో నల్లగొండ, భువనగిరి పార్లమెంటరీ ఆత్మీయ సమావేశం

## జనసేన బలోపేతమే లక్ష్యం.. రాబోయే ఎన్నికల్లో సత్తా చాటుతాం

**తొలి వార్త ,నకిరేకల్ టౌన్, సెప్టెంబర్ 12 :** నకిరేకల్ పట్టణ కేంద్రం నుంచి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణం నుంచి నారాయణ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీగా చేరుకుని, అక్కడ నిర్వహించిన జనసేన పార్టీ ఉమ్మడి నల్గొండ, భువనగిరి పార్లమెంటరీ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్, ఉమ్మడి నల్గొండ పార్లమెంటరీ ఇన్‌చార్జి మేకల సతీష్ రెడ్డి ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు... తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ ఇన్చార్జి నేముల శంకర్ గౌడ్ మాట్లాడుతూ : రాబోయే మున్సిపల్, కార్పొరేషన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో జనసేన పార్టీ బలంగా పోటీ చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేముల శంకర్ గౌడ్ అన్నారు. నల్లగొండ జిల్లాలో జనసేన పార్టీ విస్తరణకు ఉమ్మడి నల్లగొండ పార్ల మెంటరీ ఇన్‌చార్జి మేకల సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కృషి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కొండగట్టు అంజన్న, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేముల శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో తొలిసారిగా ప్రజా సమస్యలపై గళం ఎత్తిన నాయకుడు పవన్ కళ్యాణ్ అని అన్నారు.








దేశ రాజకీయాల్లో ఏ పార్టీ గెలవాలి, ఏ పార్టీ ఓడిపోవాలి అనే విషయంలో పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించే స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. జనసేన పార్టీకి ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. మేకల సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలో జనసేన సభ్యత్వం పొందిన కుటుంబాలకు పవన్ కళ్యాణ్ తరపున కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో నల్లగొండ జిల్లాలో జనసేన పార్టీ మరింత విస్తరిస్తుందని, మున్సిపల్, కార్పొరేషన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతామని నేముల శంకర్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రధానంగా నల్లగొండ--వరంగల్--ఖమ్మం ఎమ్మెల్సీ స్థానానికి గడల శ్రీనివాస్‌ను పోటీ చేయించేందుకు పార్టీ సిద్ధంగా ఉందని, దీనిపై త్వరలో అధికారికంగా ప్రకటన చేస్తామని తెలిపారు. అలాగే నకిరేకల్ మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో జనసేన అభ్యర్థులను గెలిపిస్తే.. మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని ఎవరు చేపట్టాలనే నిర్ణయం జనసేన గెలిచిన అభ్యర్థులే తీసుకుంటారని నేముల శంకర్ గౌడ్ అన్నారు. నల్లగొండ జిల్లాలో జనసేనకు బలమైన రాజకీయ శక్తిగా ఎదగడానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు... ఈ సందర్భంగా మేకల సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. 2014 నుంచి జనసేన పార్టీతో కొనసాగుతున్న నాయకులు, కార్యకర్తలతో పాటు కొత్తగా పార్టీలోకి వస్తున్న నాయకులను కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే అంశంతో పాటు, ముఖ్యంగా నకిరేకల్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో జనసేన పార్టీకి సభ్యత్వాలు ఉన్నాయని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్‌తో తనకు ఎంతోకాలంగా అనుబంధం ఉందని సతీష్ రెడ్డి తెలిపారు. 2019లో నల్గొండ ఎంపీగా పోటీ చేసిన సమయంలో తనకు అండగా నిలిచి, ఎంతో మద్దతు అందించిన నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పార్టీ కోసం కలిసి పనిచేస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. జనసేన పార్టీని ఉమ్మడి నల్గొండ జిల్లాలో మరింత బలోపేతం చేసి, రాబోయే ఎన్నికల్లో పార్టీ ప్రభావాన్ని చాటే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మీసాల శ్రీనివాస్, మచ్చ సుధాకర్, దామోదర్ రెడ్డి, తెలంగాణలో జనసేన పార్టీ తరఫున తొలి కౌన్సిలర్‌గా ఎన్నికైన విజయలక్ష్మి, నకిరేకల్ నాయకులు నల్లకంటి విక్కిరాంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నలంద డిగ్రీ అరవింద
# జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు









**చౌటుప్పల్,సెప్టెంబర్12 (తొలివార్త):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పట్టణంలోని నలంద డిగ్రీ,అరబిందో జూనియర్ కళాశాలలో ప్రెషర్స్ డే వేడుకలను స్థానిక జయశ్రీ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు.మారుతున్న కాలం తగ్గట్టు విద్యార్థినీ విద్యార్థులు తమ ఆలోచన విధానాన్ని మార్చుకుంటూ విద్యను అభ్యసించాలని,క్రమశిక్షణ విలువలతో కూడిన జీవితం అలవర్చుకోవాలని నలంద డిగ్రీ అరవిందో జూనియర్ కళాశాల చైర్మన్ బత్తుల శంకర్ అన్నారు.శనివారం స్థానిక జయశ్రీ ఫంక్షన్ హాల్ లో అరవింద జూనియర్ నలంద డిగ్రీ కళాశాల ప్రాసెస్ డే కార్యక్రమం నిర్వహించారు.ఇందుకుగాను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.విష్ణుకుమార్ అధ్యక్షతన విద్యార్థులచే నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.విద్యార్థులు బాగా కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేరుస్తూ భవిష్యత్తులో అభివృద్ధి చెందాలని కళాశాల కరస్పాండెంట్ రాజశేఖర్ కోరారు.విద్యార్థులు తమ భవిష్యత్ కోసం ఇప్పటినుండి మంచి ఆలోచన చేస్తూ ప్లాన్ ప్రకారం చదివితే ర్యాంకులు మంచి ఉత్తమ ఫలితాలు సాధించడం చాలా సులభమని కళాశాల ప్రిన్సిపాల్ పి.విష్ణుకుమార్ అన్నారు.విద్యార్థిని విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేస్తూ సమాజానికి తోడ్పాటు కావాలని సిహెచ్. దుర్గయ్య కోరారు.అదేవిధంగా ఇంటర్ డిగ్రీ విద్యార్థులు తమ సంస్కృతిక మరియు ఆటపాటలతో అలరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ వి.శ్రీనివాసులు,సిహెచ్.దుర్గయ్య,కే.లింగస్వామి,అధ్యాపక బృందం లింగయ్య ,మహేష్, కళ్యాణి, నాగలక్ష్మి, సువర్ణ, పుష్పలత,, బాలరాజు, లింగారెడ్డి, మానస,శ్రీదేవి,శ్రవణ్,తదితరులు పాల్గొన్నారు.

# కోటేశ్వరరావు,పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సర్పంచ్ మాధవరావు, ఉప సర్పంచ్ సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు




**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 12 (తొలి వార్త) :** మణుగూరు మండల పరిధిలోని ఉడతానేని నగర్ గ్రామానికి చెందిన.. మణుగూరు పట్టణ ప్రాంత ప్రజల సుపరిచితులు ఉడతానేని కోటేశ్వరరావు, శనివారం, ఉదయం గుండెపోటుతో పరమపదించినారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు వారి నివాసానికి వెళ్లి, ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్య, సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు మాదాడి రాజేష్, ఎదలపల్లి శారద, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండ్ల వెంకటేశ్వర్లు (జీ వి) తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు కృషి చేయాలి.

## సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్.

## సిపిఐ (ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ద్వితీయ వర్ధంతి సభ.



**వైరా సెప్టెంబర్ 12 తొలి వార్త :** భారత కమ్యూనిస్టు ఉద్యమంలో విశిష్ట పాత్ర పోషించిన సిపిఐ ఎం అఖిలభారత మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ పిలుపునిచ్చారు. సిపిఐ ఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు పైడిపల్లి సాంబశివరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి జీవితాంతం పేదలు కార్మికులు, రైతులు మహిళలు అనగారిన వర్గాల హక్కుల కోసం పోరాడారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ లౌకికవాదం సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. దేశంలో మతోన్మాదం కార్పొరేట్ అనుకూల విధానాలు పెరుగుతున్న పరిస్థితుల్లో సీతారాం ఏచూరి చూపిన మార్గంలో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు రైతులు ప్రజలను ఐక్యం చేసి పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి ఆశయాలను కేవలం స్మరించుకోవడం కాకుండా వాటిని ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. సిపిఎం పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం వైరా పట్టణ నాయకులు గుడిమెట్ల రజిత కొంగర సుధాకర్, గుమ్మా నరసింహారావు కామినేని రవి తోటా కృష్ణవేణి కాంశాని మల్లికాంబ అమరనేని కృష్ణ చిత్తూరు నాగేశ్వరరావు తమ్మి విజయరాజు పాల్గొని కామ్రేడ్ సీతారాం ఏచూరి కి ఘనంగా నివాళులర్పించారు.

# సీతారాం ఏచూరి గారి ఆశయాలను సాధిస్తాం...!

## బూరుగు కృష్ణారెడ్డి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు





**చౌటుప్పల్,సెప్టెంబర్12 (తొలివార్త):** చౌటుప్పల సిపిఎం పార్టీ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి శనివారం రోజున అమరజీవి కందాల రంగారెడ్డి స్మారక భవనం నందు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి విచ్చేసి మాట్లాడుతూ..సీతారాం ఏచూరి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక గొప్ప నాయకుడని,ప్రజల సమస్యలను లోతుగా అర్థం చేసుకున్న మేధావి అని అన్నారు.విద్యార్థి దశలోనే విద్యార్థుల హక్కుల కోసం పోరాడారు,ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాడి అరెస్ట్ అయిన గొప్ప నాయకుడని అన్నారు.దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు,పేదలు, అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన నిరంతరం గొంతు ఎత్తారని,లౌకికవాదం,ప్రజాస్వామ్యం,రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. ఉత్తమ రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో కూడా ఆయన తన వాదనను ఎంతో స్పష్టంగా, ఆధారాలతో సహా వినిపించారని,లౌకిక ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత కోసం ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా గుర్తుండి పోతుందని అన్నారు.అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి గారిని నిజంగా స్మరించుకోవడం అంటే కేవలం మనం ఆయన చిత్రపటానికి పూలమాల వేయడం కాదు.ఆయన చూపిన మార్గంలో ప్రజా సమస్యలపై పోరాటం, కార్మిక,కర్షక ఐక్యతను బలోపేతం చేయడం, ప్రజాస్వామ్యాన్ని మరియు లౌకిక విలువలను కాపాడటం అని అన్నారు.ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్,జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా,బండారు నరసింహ,బత్తుల దాసు,ఆకుల ధర్మయ్య, ఉస్కాకుల శ్రీను,ఎండి ఖయ్యూం,కందగట్ల ఆనంద్,పర్ని ధర్మ రెడ్డి,సప్పిడి శ్రీనివాస్ రెడ్డి,బావుండ్లపల్లి స్వామి, ఎండి రేష్మ,చికూరు ఈదయ్య,రాములు, చంద్రయ్య,పల్లె శివ,పాల్గొనడం జరిగింది.

# క్రీడల్లో రాణిస్తున్న శ్రీ సాయి ప్రశాంతి విద్యా నికేతన్ విద్యార్థులు

## విద్యార్థులను ప్రోత్సహిస్తున్న హెచ్‌ఎం తోటకూరి యాదయ్య



**భువనగిరి, సెప్టెంబర్ 12। (తొలి వార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని భువనగిరి పట్టణ శివారులోని శ్రీ సాయి ప్రశాంతి విద్యా నికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటకూరి యాదయ్య అన్నారు. భువనగిరి మండల స్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులను శనివారం పాఠశాలలో అభినందించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన యు. అక్షిత అండర్-14 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ బహుమతి సాధించింది. బి. రాకేష్ అండర్-14 లాంగ్‌జంప్‌లో ప్రథమ బహుమతి సాధించాడు. టి. శిరీష అండర్-17 షాట్‌పుట్‌లో ద్వితీయ బహుమతి సాధించింది. ఆర్. ధనుష్, బి. రుతిన్ అండర్-17 కబడ్డీ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. ఐ. జస్వంత్ అండర్-14 కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచాడు. మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు తోటకూరి యాదయ్యతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించేందుకు పాఠశాల తరఫున అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని వారు తెలిపారు.

# రామన్నపేట కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ విజయవంతం




**రామన్నపేట, సెప్టెంబర్ 12, (తొలి వార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా రామన్నపేట కోర్టుల పరిధిలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మరియు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట చైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. సబిత గారి ఆధ్వర్యంలో జరిగింది. జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాల కేసులకు రాజీ మరియు పరిష్కారం ద్వారా ముగింపు లభించింది. ఈ సందర్భంగా క్రిమినల్ కేసులు 77, సివిల్ కేసులు 03, బ్యాంకు ప్రీ-లిటిగేషన్ కేసులు 06, వాటికి సంబంధించిన మొత్తం రూ.1,09,870/-, ఈ-పెట్టి కేసులు 735, వాటికి సంబంధించిన మొత్తం రూ.7,350/-, అలాగే ఋణ కేసులు 755 పరిష్కరించబడినవి. ఈ విధంగా మొత్తం 1,576 కేసులు పరిష్కరించబడినవి. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం ద్వారా కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు, పరస్పర అంగీకారంతో వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించినది. న్యాయ సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు సత్వర, సులభ మరియు ఉచిత న్యాయ సహాయం అందించడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు, బ్యాంకు అధికారులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొని, కేసుల పరిష్కారానికి సహకరించారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన సర్పంచ్ భూక్య చిన్నయ్య నాయక్.



**రఘునాథపాలెం సెప్టెంబర్ 12 తొలి వార్త :** తెలంగాణ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం పేద మద్దతు కుటుంబాలకు అండగా నిలుస్తూ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా కొర్లబోడు తండ గ్రామపంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా గ్రామ సర్పంచ్ భూక్య చిన్నయ్య నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ఆఫీస్ వద్ద పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిన్నయ్య నాయక్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బిమ్లా నాయక్ గ్రామ శాఖ అధ్యక్షులు భూక్య మల్సూర్ ఆరో వార్డు మెంబర్ గుగులోతు నరేష్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సెప్టెంబర్ 17న తెలంగాణ దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు




**భద్రాద్రి జిల్లా అశ్వాపురం, సెప్టెంబర్ 12 (తొలి వార్త) :** తెలంగాణ విముక్తి దినమైన సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కమటం, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1947 సెప్టెంబర్ 17 న బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని గుర్తుచేశారు. కమ్యూనిస్టుల పోరాటంతో 10 వేల గ్రామాలు విముక్తమై, 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ జరిగిందన్నారు. సాయుధ పోరాట చరిత్రతో సంబంధం లేని బీజేపీ నేతలు దానిని హిందూ-ముస్లింల వివాదంగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని, ఆయన విమర్శించారు. షేక్ బంధగి, షోయబుల్లా ఖాన్, మఖ్దూం మొహియుద్దీన్ వంటి ముస్లిం యోధులు కూడా నిజాం, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక, సెప్టెంబర్ 17ను, పరిపాలించిన ఆనాడు బీఆర్ఎస్, కెసిఆర్ ప్రభుత్వం అధికారికంగా,నిర్వహించలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా, అధికారికంగా సెప్టెంబర్ 17న తెలంగాణ దినోత్సవం కార్యక్రమం నిర్వహించాలనీ కమటం వెంకటేశ్వరరావు కోరారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో నిజాం పాలిత ప్రాంతాల్లో ప్రభుత్వం అధికారికంగా,నిర్వహిస్తున్నప్పుడు తెలంగాణలో కూడా ఎందుకు, నిర్వహించరని ఆయన ప్రశ్నించారు.

# కొనిజర్ల సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి.



**కొనిజర్ల సెప్టెంబర్ 12 తొలి వార్త :** కొనిజర్ల మండల కేంద్రంలో సంక్రాంతి రామచంద్రయ్య భవన్ లో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండో వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి గారి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణ మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశనుండే కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేస్తూ గ్రామస్థాయి నుండి అఖిలభారత స్థాయి వరకు ఎదిగిన నేతని, ఏ విషయమైనా తనదైన శైలిలో అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించేవాడని రాజ్యసభ సభ్యునిగా పార్లమెంటులో అందరూ అభిమానాన్ని చేరుకొని ముఖ్యంగా పేదల దళితులు అన్ని వర్గాల ప్రజల సమస్యలపై పోరాటం నిర్వహించారని ఆయన చేసిన పోరాటాలను కొని ఆడారు. దేశంలో కమ్యూనిస్టులు బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని భవిష్యత్తులో ఎర్రజెండాలన్నీ ఏకమై దేశ రాజకీయాలను శాసించే స్థాయికి రావాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు కట్టుబడి పనిచేస్తుందని పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటుందని ఎప్పటికైనా ప్రభుత్వం ప్రజా సమస్యల కోసం పనిచేయాలని అన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కాకపోతే ఉద్యమాలు మరింత బలోపేతం చేస్తామని ఆయన అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారమైనప్పుడే మనం ఏచూరి కి ఇచ్చే ఘన నివాళులు అని అన్నారు. ఈనెల 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు అన్ని గ్రామాలలో తెలంగాణ సాయుధ పోరాటా వారోత్సవాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం కి కూడా ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తాతా వెంకయ్య పార్టీ మండలాల నాయకులు బోయినపల్లి శ్రీనివాసరావు అన్నారపు వెంకటేశ్వర్లు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పినపాక నియోజకవర్గానికి రూ.186 కోట్ల హెచ్ఏఎం నిధులు మంజూరు పట్ల

## రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 12 (తొలి వార్త) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. నియోజక వర్గంలోని బీటీ రహదారులు, వంతెనలు, బ్రిడ్జిల నిర్మాణం మరియు అభివృద్ధి పనుల కోసం హెచ్ఏఎం నిధుల నుంచి సుమారు రూ.186 కోట్ల భారీ నిధులు మంజూరయ్యాయి. ఈ విషయాన్ని పినపాక, నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెల్లడించారు. మంజూరైన నిధులతో నియోజకవర్గంలో అవసరమైన రహదారులు, కల్వర్టు వంతెనలు, బ్రిడ్జిలు, అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు, ఎమ్మెల్యే పాయం,తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌక ర్యాలు కల్పించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల అను సంధానం మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా దసరా పండుగ లోపే పనులను ప్రారంభించేలా చర్యలు తీసు కుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అంతేకాకుండా, చేపట్టబోయే పనులకు



సుమారు, 15,సంవత్సరాలపాటు, నిర్వహణ బాధ్యత కూడా సంబంధిత సంస్థలదే ఉండే విధంగా హెచ్ఏఎం విధానంలో పనులు చేపట్ట నున్నట్లు పేర్కొన్నారు.పినపాక నియోజకవర్గ ప్రజల చిరకాల సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఇంత భారీ మొత్తంలో నిధులు మంజూరు కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన ఆర్అండ్బీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపినందుకు మంత్రి కి హృదయపూర్వక , కృతజ్ఞతలు తెలిపారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తూ, రహదారులు, వంతెనల నిర్మాణానికి ఇంత భారీ స్థాయిలో నిధులు సమకూర్చిన రాష్ట్ర ప్రభుత్వం, ఆర్అండ్బీ శాఖ అధికారులు మరియు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు."ఈ నిధులతో నియోజకవర్గ రూపు రేఖలు మారనున్నాయి. రహదారులు, వంతెనల సమస్యలకు శాశ్వ త పరిష్కారం లభించనుంది. ప్రజలకు మెరుగైన రవాణా సౌక ర్యాలు అందించడమే లక్ష్యంగా పనులను వేగంగా ప్రారంభిస్తాం" అని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, పేర్కొన్నారు.

## పంచాయతీ రాజ్ చట్టం - 2018 సెక్షన్ 70 (3) సవరణ పట్ల

### సీఎం రేవంత్ రెడ్డి కి మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేసిన సర్పంచ్ ఎట్టి నరేష్




**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 12 (తొలి వార్త):** గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకి జమ చేయకుండా గ్రామపంచాయతీ ఖాతాల్లో, జమ, చేసుకొని, గ్రామపంచాయతీ అవసరాలకు తీర్మానం చేసుకొని ఖర్చు చేసుకునే విధంగా పంచాయతీ రాజ్ చట్టం – 2018 సెక్షన్ 70 (3) సవరణ చేసి అసెంబ్లీలో ఆమోదం తెలిపి చట్ట సవరణ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసి అశ్వాపురం మండలం తుమ్మలచెరువు, గ్రామపంచాయతీ సర్పంచ్, ఎట్టి నరేష్, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు, కృతజ్ఞతలు తెలి పారు. ఈ సందర్భంగా,సర్పంచ్,ఎట్టి నరేష్, మాట్లాడుతు గ్రామపంచాయతీ అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను సత్వరం పరిష్కారం చేసుకోవడానికి పంచాయతీలకు గొప్ప అవకాశాన్ని కల్పించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క కి అలాగే పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపినారు.

## పంచాయతీ రాజ్ చట్టం - 2018 సెక్షన్ 70 (3) సవరణ తీర్మానం పట్ల సీఎం రేవంత్ రెడ్డి కి మంత్రి సీతక్క కి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి కృతజ్ఞతలు తెలిపిన,సర్పంచ్,లు మడకం మూలమ్మ, కొండ్రు అంజమ్మ,




**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 12 (తొలి వార్త) :** గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకి జమ చేయకుండా గ్రామపంచాయతీ ఖాతాల్లో, జమ, చేసుకొని, గ్రామ పంచాయతీ అవసరాలకు తీర్మానం చేసుకొని ఖర్చు చేసుకునే విధంగా పంచాయతీ రాజ్ చట్టం – 2018 సెక్షన్ 70 (3) సవరణ, తీర్మానం చేసి అసెంబ్లీలో ఆమోదం తెలిపి చట్ట సవరణ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసి అశ్వాపురం మండలం, వెంకటాపురం, గొంది గూడెం కొత్తూరు, గ్రామపంచాయతీ,ల సర్పంచ్,లు మడకం మూలమ్మ, కొండ్రు అంజమ్మ,లు, మరియు ఉప సర్పంచ్, లు మరియు వార్డు సభ్యులు, కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా,సర్పంచ్,లు, కొండ్రు అంజమ్మ, మడకం మూలమ్మ, వారు ఇరువురు, విలేకరులతో, మాట్లాడుతు గ్రామపంచాయతీ అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను సత్వరం పరిష్కారం చేసుకోవడానికి పంచాయతీలకు గొప్ప అవకాశాన్ని కల్పించిన, కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి,పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి, సీతక్క కి, పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి, వారు ఇరువురు గ్రామపంచాయతీల సర్పంచులు, మరియు ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపినారు.

## నెల రోజులుగా డ్రైనేజీ సమస్య - వెంటనే పరిష్కరించాలి.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,సెప్టెంబర్ 12,తొలి వార్త ప్రతి నిధి :** జీడిమెట్ల మీనాక్షి కాలనీ , అంగడిపేట రోడ్‌లో వైన్ షాప్ సమీపంలో డ్రైనేజీ లీకేజీ కారణంగా మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను ఈరోజు స్థానికులు నా దృష్టికి తీసుకురావడం జరిగింది. వెంటనే స్పందించి సమస్యను స్వయంగా పరిశీలించిన జీడిమెట్ల 132వ డివిజన్ (286, 287) బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి, సంబంధిత జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసి, డ్రైనేజీ లీకేజీని వెంటనే మరమ్మతు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. నెల రోజులుగా కొనసాగుతున్న ఈ సమస్యపై అధికారులు ఇకనైనా తక్షణమే స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం -- ప్రజల కోసం నిరంతరం అందుబాటులో ఉంటాం.

## గాజుల రామారాశీ డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులందరికీ నమస్కారం.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,సెప్టెంబర్ 12,తొలి వార్త ప్రతి నిధి :** గత సోమవారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ అయినటువంటి కొలను హనుమంత రెడ్డి అన్న కొబ్బరకాయ కొట్టి మన యొక్క పార్కులకు శంకుస్థాపన చేసినటువంటి విషయం అందరికీ తెలిసినదే నిన్న కాంట్రాక్టర్ గారు పని మొదలుపెట్టిన విషయం అందరికీ తెలిసినదే ఆ యొక్క పనిని కొలను హనుమంత రెడ్డి అన్న ఆదేశాల మేరకు డివిజన్ ప్రెసిడెంట్ అయినటువంటి సంజీవరెడ్డి అన్నగారు మరియు మైనారిటీ డివిజన్ ప్రెసిడెంట్ అయినటువంటి అఫ్జల్ బాయ్ పని జరుగుతున్న స్థలానికి వచ్చి పనులను పర్యవేక్షిశీధి కాంట్రాక్టర్ కి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది అలాగే మనకు ఉన్నటువంటి ఎటువంటి ఇబ్బందుల నాయనా మేము దగ్గర ఉండి పనులను చేయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది అట్టి కార్యక్రమంలో మన డబల్ బెడ్ రూమ్ సొసైటీ జనరల్ సెక్రెటరీ అయినటువంటి శ్రీనివాస్ మరియు కోశాధికారి అయినటువంటింశ్రీ ప్రసాద్ జాయింట్ సెక్రెటరీ అయినటువంటి ప్రభాకర్ ఆలీ సాయిద్ ప్రదీప్, నాగరాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలాలబస్తి మల్లన్న దేవాలయం రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సెప్టెంబర్ 12,తొలి వార్త ప్రతి నిధి :** జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుమ్ నగర్ నగర్ పోలాల బస్తిలో వెలసిన మల్లన్న స్వామి ఆలయం రహదారి సీసీ రోడ్డు పనులకు శనివారం మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ భక్తుల సౌకర్యార్థం దాదాపు ఆరు లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులను మంజూరు చేపించడం జరిగిందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ యువజన నాయకులు కొలుకుల జైహింద్, బిజెపి నాయకులు పున్నారెడ్డి, స్థానిక నాయకులు దేపే కృష్ణ, భాస్కర్ రెడ్డి, రాములు, రాజు, భాస్కర్, ప్రేమ్ చందర్ రెడ్డి, వేణుగోపాల్, దేవేందర్, అర్జున్, డిజె సాయి తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోపు సర్ ప్రక్రియను పూర్తి చేయాలి..

### జిల్లా అదనపు కలెక్టర్ హరి సింగ్..



**నూతనకల్, సెప్టెంబర్ 12 తొలి వార్త :** మండలంలో జరుగుతున్న సర్ 2026 ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పరిష్కారం, స్వీకరణ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ , ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బి.హరి సింగ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలం లోని 166 నుండి 171 నెంబర్లు గల పోలింగ్ కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న నోటీసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరును ఓటర్ల జాబితాలో చేర్చడంతో పాటు మార్పులు, తొలగింపులు,సవరణలకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీ లించి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సర్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా నిబంధనల మేరకు పనులను పూర్తి చేయాలని, ప్రత్యేక ప్రచార దినాలను సద్వినియోగం చేసుకొని పెండింగ్ దరఖాస్తులు, నోటీసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిం చాలని వారు అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు, సంబంధిత రెవిన్యూ అధికారులు, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ రాజ్ చట్టం - 2018 సెక్షన్ 70 (3) సవరణ,చట్టం తీర్మానం పట్ల

### సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క కి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి కృతజ్ఞతలు తెలిపిన సమితి సింగారం సర్పంచ్ మాధవరావు ఉప సర్పంచ్,సురేష్



**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 12 ( తొలి వార్త) :** గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకి జమ చేయకుండా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసుకొని గ్రామపంచాయతీ అవసరాలకు తీర్మానం చేసుకొని ఖర్చు చేసుకునే విధంగా పంచాయతీ రాజ్ చట్టం – 2018 సెక్షన్ 70 (3) సవరణ చేసి అసెంబ్లీలో ఆమోదం తెలిపి చట్ట సవరణ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసిన, మణుగూరు మండలం సమితి సింగారం,మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, మరియు వార్డు సభ్యులు, ఈ సందర్భంగా,వారు ఇరువురు మాట్లాడుతు గ్రామపంచాయతీ అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు,గ్రామాలలో, ఉన్న సమస్యలను సత్వరం పరిష్కారం చేసుకోవడానికి పంచాయతీలకు గొప్ప అవకాశాన్ని కల్పించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,కి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క కి పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కి, సర్పంచ్ మాధవరావు ఉప సర్పంచ్ సురేష్ వార్డ్ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినారు.

## ఎర్రపహాడ్ గ్రామంలో ముగిసిన శ్రీరామ భజన..



**నూతనకల్, సెప్టెంబర్ 12 (తొలి వార్త) :** మండల పరిధిలోని ఎర్ర పహాడ్ గ్రామంలో శ్రీ శ్రీ భక్తాంజనేయ స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామ భజన కార్యక్రమం శనివారంతో ముగిసింది. మండల కాలం (41 రోజులు) భక్త బృందం గ్రామంలో సాయంత్రం నుండి రాత్రి వరకు వీధులలో తిరుగుతూ భజనలు చేసి గ్రామంలో భక్తిని పరవశింప జేశారు. ప్రతిరోజు మహిళలంతా తమ ఇంటి ప్రాంగణా లలో భజన బృందానికి ఆహ్వానం పలుకుతూ ముగ్గులు వేసి అఖండ జ్యోతి కి తిలకమును దిద్ది జ్యోతికి నూనెను పోసి ఫలహారములు ప్రసాదములు నైవేద్యంగా సమర్పించి పాలకాయలను కొట్టి తమ భక్తిని చాటుకున్నారు.కాగా 41 రోజులు పూర్తి కావడంతో శనివారంతో భజనకు ముగింపు పలకడానికి భక్త బృందం ఆ రోజంతా ఉదయం నుండి మొదలుకొని రాత్రి వరకు గ్రామంలోని వీధులలో అఖండ జ్యోతిని ప్రదర్శింపజేసి భక్తులకు ముక్తిని కలిగించి తమ భజనలు ముగించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారాలకు నైవేద్యములను తీర్థ ప్రసాదములను తయారుచేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో భక్త భజన బృందం సభ్యులు పసుల అవిలయ్య (గురు స్వామి),శీలం అంజయ్య, నూకల మల్లయ్య,లక్ష్మయ్య, ముత్యం యాదయ్య,గుర్రం మల్లయ్య,అనంతుల రాఘవులు,సత్తయ్య,లింగాల శంకర్,మల్లేష్,అవిలేని అశోక్ రెడ్డి,అనంతల ఉప్పలయ్య, తంగళ్ళపల్లి అంజయ్య,గడ్డం హరీష్,గుండగాని మల్లయ్య, దామెర్ల కృష్ణయ్య,మెట్టు లింగయ్య,దూదిమెట్ల మహేష్, బోయిని అశోక్,తొనుకునూరి మహేష్,శీలం శ్రీకాంత్,మహేష్, కుంచం అశోక్,గ్రామ పెద్దలు, భక్త ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి




**వలిగొండ, సెప్టెంబర్ 12 । (తొలి వార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు రామన్నపేట సీఐ మొలుగూరి రవి ఆధ్వర్యంలో వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో మండలంలోని గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్నపేట సీఐ మొలుగూరి రవి, వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మండల ప్రజలు గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులకు సహకరిస్తూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

## మధు యాష్కీ గౌడ్‌కు శుభాకాంక్షలు లింగోజిగూడ అధ్యక్షులు కంది కంటి శ్రీధర్ గౌడ్



**ఎల్బీనగర్ సెప్టెంబర్ 12 (తొలి వార్త) :** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఏఐపిసి చైర్‌పర్సన్‌గా నియమితులైన తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధు యాష్కీ గౌడ్ కాంగ్రెస్ నాయకులు కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. లింగోజిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందికంటి శ్రీధర్ గౌడ్, సాయినగర్ కాలనీ అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లికార్జున తదితరులు మధు యాష్కీ గౌడ్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, నూతన బాధ్యతల్లో మరింత విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.

## చౌల్ సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతుల పంపిణీ పాల్గొన్న ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరావత్రి రాజశేఖర్

### - ఎస్ ఎస్ కే క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది)



**నిజామాబాద్ జిల్లా: ఆర్మూర్, సెప్టెంబర్ (12) :** ఆర్మూర్ పట్టణం లో ని చిన్న బజార్ చౌల్ సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం లో ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను ఆరాధించాలని కోరారు. చౌల్ సాయి శ్రీనివాస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రాబోయే పండుగలను ప్రశాంతంగా నిర్వహించు కోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఈ ఆర్ ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, ఓమ్ ట్రేడర్స్ గంగ మోహన్, కేవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్లో చౌల్ సాయి శ్రీనివాస్ ఉచితంగా మట్టి గణపతులు పంపిణీ

### - ఆర్మూర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీదేవి

### - ఎస్ ఎస్ కె సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ సీనియర్ న్యాయవాది



**నిజామాబాద్ జిల్లా: ఆర్మూర్, సెప్టెంబర్ (12) :** ఆర్మూర్ పట్టణంలో ని చిన్న బజార్ లో చౌల్ సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై దంపతులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆర్మూర్ క్షత్రియ సమాజ్ అధ్యక్షులు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది) ఆనంద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గణపతి పూజ భక్తి సదులతో ఘనంగా నిర్వహించాలని గణపతి యొక్క ఆశీస్సులు తీసుకోవాలని పేర్కొన్నారు. గణపతి మండప వివాహకులు గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని శాంతియుత వాతావరణం లో గణపతి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాగే ఈ సంవత్సరం కూడా చౌల్ సాయి ప్రభాస్ ఉచిత మట్టి గణపతులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణం లో ప్రతి ఒక్కరూ పాలు పట్టించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకలితో ఉన్న వారికి ఆహార దానం

## ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వద్ద సుమారు 200 మందికి మధ్యాహ్న భోజనం పంపిణీ

**హైదరాబాద్ 12 సెప్టెంబర్ (తొలివార్త ) :** ఆకలితో ఉన్న వారికి అండగా నిలవడం, ఆపదలో ఉన్నవారికి మానవతా దృక్పథంతో సహాయం అందించడమే లక్ష్యంగా యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. దీమ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి






సహకారంతో హైదరాబాద్‌లోని ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వద్ద సుమారు 200 మందికి స్వచ్ఛందంగా మధ్యాహ్న భోజనాన్ని పంపిణీ చేశారు. క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్యంతో ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటుంటారని, ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులతో పాటు రోజువారీ భోజనం కూడా భారంగా మారుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం ఒక పూట భోజనాన్ని అందించడం ద్వారా వారికి కొంత ఊరట కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాల్లో ఆకలితో ఉన్న వారిని గుర్తించి, వారికి ఆప్యాయతతో భోజనం అందించారు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా సమాజంలోని అవసరమైన వారికి సహాయం చేయడమే నిజమైన మానవత్వానికి నిదర్శనమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ కింతల విజయరాణి, వైస్ ప్రెసిడెంట్ శ్రావ్య అర్చన, కొలిపాక సాయికిరణ్, మొహమ్మద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ అవసరమైన వారికి భోజనం అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, "ఆకలితో ఉన్న వ్యక్తికి ఒక పూట భోజనం అందించడం కేవలం ఆహారం ఇవ్వడం కాదు.. ఆ సమయంలో అతనికి అండగా నిలవడం. మానవత్వం, సేవాభావం ప్రతి ఒక్కరిలో పెంపొందాలి. సమాజంలో అవసరమైన వారిని గుర్తించి వారికి చేతనైన సహాయం అందించాలనే లక్ష్యంతో యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు సాగుతుంది" అని తెలిపారు. అలాగే, ఈ సేవా కార్యక్రమానికి సహకారం అందించిన దీమ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యానికి, నిర్వాహకులకు ట్రస్ట్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సేవా కార్యక్రమాలకు సంస్థ అందిస్తున్న సహకారం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా మరిన్ని మానవతా కార్యక్రమాలను కలిసి నిర్వహించేందుకు సహకారం కొనసాగించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడినవారు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలు, ఆకలితో ఉన్న నిరుపేదలను గుర్తించి వారికి అవసరమైన సమయంలో సహాయం అందించడమే ట్రస్ట్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆహార పంపిణీతో పాటు విద్య, వైద్యం, పేద కుటుంబాలకు సహాయం, అత్యవసర పరిస్థితుల్లో మానవతా సేవలు వంటి పలు కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. "ఒక్కరి ఆకలి తీర్చడం చిన్న సహాయం కావచ్చు.. కానీ ఆ వ్యక్తికి అది ఆ రోజు అందిన గొప్ప మానవత్వం కావచ్చు" అనే సందేశంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

## నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా సభ్యుల పరిచయ కార్యక్రమం



**ఎల్. బి.నగర్ 12 సెప్టెంబర్ (తొలివార్త ) :** నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో లో సభ్యుల చేరికలు, పరిచయ వేదిక నిర్వహించారు ఈ కార్యక్రమం లో జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా సామజిక బాధ్యతో నడుస్తుంది ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉన్న మమ్మల్ని సంప్రదించవచ్చు అన్నారు ఈ కార్యక్రమం లో నేషనల్ అడ్వైజర్ లక్ష్మి సౌజన్య,జాయాంట్ సెక్రెటరీ ఉత్తమ్ కుమార్, తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## చిల్పకుంట్ల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత



**నూతనకల్ సెప్టెంబర్ 12 (తొలి వార్త) :** మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన అంబటి కౌసల్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కొడుకు కోడలు. ఇద్దరూ 20 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు ఉన్న ఒక మనవరాలు దిక్కుతోచని స్థితిలో ఉంది ఇలాంటి సమయంలో మేము ఉన్నాం అంటూ సిపిఎం గ్రామ శాఖ ముందుకు వచ్చి దగ్గరుండి స్వయంగా అంత్యక్రియలను నిర్వహించింది నేను సైతం అంటూ సిపిఎం మండల కమిటీ సభ్యుడు ఉప సర్పంచ్ సామ సురేందర్ రెడ్డి గారు 50 కిలోల బియ్యాన్ని కుటుంబానికి అందజేశారు సిపిఎం చిల్పకుంట్ల గ్రామ శాఖ (10000. )పదివేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేశారు కుటుంబానికి ధైర్యం చెప్పి సానుభూతిని తెలియజేసి సంతాపం ప్రకటించారు ఏ కష్టం వచ్చినా మేము ఉన్నాం అంటూ ధైర్యం చెప్పి నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పులుసు సత్యం సర్పంచి అంజాపల్లి నర్సమ్మ లక్ష్మయ్య ఉప సర్పంచ్ సామ సురేందర్ రెడ్డి శాఖ కార్యదర్శి గజ్జల శ్రీనివాసరెడ్డి బద్దం ఇంద్రసేనారెడ్డి బాణాల విజయ్ రెడ్డి దేశోదు బ్రహ్మాచారి అన్నారం యాదగిరి కూసు వెంకన్న చీమల శీను రేసు జనార్ధన్ శ్రీహరి ముండ్ల సంజీవ చీమల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## నాణ్యమైన కరెంటు ఇవ్వాలని సబ్ స్టేషన్ వద్ద ధర్నా



**తుర్కపల్లి ,సెప్టెంబర్ 12 (తొలి వార్త) :** తుర్కపల్లి మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద రైతులకు నాణ్యమైన 24 గంటల కరెంటు ఇవ్వాలని బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన 24 గంటల కరెంటు రావడం లేదని, పొలాలు ఎండిపోతున్నాయని, రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు . 24 గంటల కరెంటు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు , మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన తహసిల్దార్




**తుర్కపల్లి, సెప్టెంబర్ 12 (తొలి వార్త) :** తుర్కపల్లి మండలంలోని 71 ,76 పోలింగ్ బూత్ లో సర్ కార్యక్రమాన్ని పరిశీలించినట్టు తాసిల్దార్ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెండు రోజులపాటు సర్ కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రజలు స్పెషల్ డ్రైవ్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటర్ నమోదులో ఎలాంటి తప్పులున్న సరి చేయడం జరుగుతుందని అన్నారు

## సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి




**తుర్కపల్లి, సెప్టెంబర్ 12 (తొలి వార్త) :** సీతారాం ఏచూరి నాశయ్య సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ అన్నారు .శనివారం తుర్కపల్లి సిపిఎం పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశనుండే వామపక్ష రాజకీయాలకు ఆకర్షితులై ఎస్ఎఫ్ఐ లో చేరి ఢిల్లీలోని జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో యూనివర్సిటీ అధ్యక్షునిగా, ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షునిగా ,సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులుగా, పోలిట్ బ్యూరో సభ్యులుగా, అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా అంచలంచలుగా బాధ్యతలు స్వీకరించి మార్చిస్ట్ మేధావి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొక్కొండ లింగయ్య, తుటి వెంకటేశం, ఆవుల కలమ్మ, భూక్య లక్ష్మీ, భూక్య తార్య పాల్గొన్నారు

# వినాయక విగ్రహ కమిటీల సభ్యులతో సమావేశం

### మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి శాంతియుతంగా నిర్వహించాలి అశ్వాపురం సీఐ ఎల్లయ్య

**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 12 (తొలి వార్త) :** అశ్వాపురం, మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అశ్వాపురం సీఐ సిహెచ్. ఎల్లయ్య మండలంలోని వినాయక విగ్రహ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల, నిర్వహణకు సంబంధించి పోలీసుల సూచనలు, నిబంధనలను కమిటీ సభ్యులకు వివరించారు.రోడ్డు ఆక్రమిస్తూ గణేష్ మండపాలు నిర్మించవద్దని ప్రజలకు, ట్రాఫిక్ అవాంతరం లేకుండా మండపాలను నిర్మించుకోవాలని సూచించారు. వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకో వాలని, మండపాల వద్ద భద్రతా చర్యలు పాటించాలని సూచిం చారు. డీజేలు, వినియోగం నిశిద్దము.లిమైక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు




కలిగిం చవద్దని తెలిపారు. రాత్రి 10తరువాత ఎటువంటి మైకులు వినియోగించకూడదు. ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రహదారులను పూర్తిగా దిగ్బంధించకుండా చూడాలని సూచించారు.విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ,ఎల్లయ్య, సూచించారు. నిమజ్జన కార్యక్రమాన్ని పోలీసుల సూచనలు, మార్గాల్లోనే నిర్వహించాలని, యువత శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించవద్దని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, గొడవలకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ ఎల్లయ్య హెచ్చరించారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు కమిటీ సభ్యులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

# సారపాక మైనార్టీ బాలికల హాస్టల్‌లో ఎలుకల కాటు.. ఏడుగురికి చికిత్స

### ఏడుగురు విద్యార్థినులకు వైద్యం
### మూడు డోసుల వ్యాక్సినేషన్ పూర్తి
### 18న మరో డోస్ ఇవ్వనున్న అధికారులు
### ఎలుకల నివారణకు చర్యలు

**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు సెప్టెంబర్ 12 ( తొలివార్త ) :** భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల హాస్టల్‌లో ఎలుకలు విద్యార్థినులను కరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హాస్టల్‌లో ఉన్న విద్యార్థినుల్లో మొత్తం ఏడుగురిని ఎలుకలు కరిచినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు హాస్టల్‌ను పరిశీలించడంతో పాటు విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి, హాస్టల్ పరిసరాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై వివరాలు సేకరించారు. ఇదే తరహా ఘటన గతంలోనూ చోటుచేసుకున్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఎలుకల కాటుకు గురైన విద్యార్థినుల విషయంలో హాస్టల్ సిబ్బంది వెంటనే స్పందించి వారిని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించినట్లు విజిలెన్స్ అధికారి తెలిపారు. వైద్యుల సూచనల మేరకు విద్యార్థినులకు అవసరమైన వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, ఇప్పటికే మూడు డోసుల వ్యాక్సినేషన్ పూర్తయిందని వెల్లడించారు. ఈ నెల 18వ తేదీన మరో డోస్ ఇవ్వాల్సి ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఏడుగురిలో ఐదుగురు విద్యార్థినులు హాస్టల్‌లోనే ఉన్నారని, మరో ఇద్దరు తమ తల్లిదండ్రులతో కలిసి ఇంటికి వెళ్లినట్లు వివరించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు హాస్టల్‌లో ఎలుకల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. హాస్టల్




పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఎలుకలు ప్రవేశించకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థినులకు అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య చర్యలను మరింత పటిష్టం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఘటనపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి సంబంధిత సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. కాగా, హాస్టల్‌లో 40 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచినట్లు వచ్చిన సమాచారం వాస్తవం కాదని విజిలెన్స్ అధికారి స్పష్టం చేశారు. మొత్తం ఏడుగురు విద్యార్థినులనే ఎలుకలు కరిచినట్లు ఆయన తెలిపారు. ఎలుకల కాటుకు గురైన విద్యార్థినులకు సకాలంలో వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన వ్యాక్సినేషన్ పూర్తిచేసినట్లు వెల్లడించారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ హాస్టల్‌లో ఎలుకల నివారణ చర్యలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# గణేష్ మండపాల వద్ద భద్రతా నియమాలు తప్పనిసరి

### మండపాల నిర్వాహకులు పోలీసుల మార్గదర్శకాలు తప్పక పాటించాలి స్థానిక ఎస్సై మేడ ప్రసాద్

**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు సెప్టెంబర్ 12 ( తొలివార్త ) :** రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు గణేష్ మండపాల నిర్వాహకులు, మండల సర్పంచులతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండపాల ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత తదితర అంశాలపై ఎస్ఐ మేడ ప్రసాద్ పలు సూచనలు చేశారు.గణేష్ మండపాల నిర్వాహకులు ముందస్తుగానే ఆన్‌లైన్‌లో మండపానికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేసుకుని, సంబంధిత అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్ఐ సూచించారు. ఇందుకోసం తెలంగాణ పోలీస్ పోర్టల్‌లో మండప వివరాలను నమోదు చేయాలని తెలిపారు.అలాగే మండపాల ఏర్పాటుకు విద్యుత్ శాఖ నుంచి అవసరమైన అనుమతులు తీసుకోవాలని సూచించారు.మండపాలను ఏర్పాటు చేసే సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రహదారులు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా మండపాలు ఏర్పాటు చేయరాదని తెలిపారు.మండపాల వద్ద, అలాగే గణేష్ నిమజ్జన ఊరేగింపుల సమయంలో డీజేలను వినియోగించరాదని స్పష్టం చేశారు.ప్రతి గణేష్ మండపం వద్ద కనీసం ముగ్గురు వాలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు.మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు



కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని, ప్రతి మండపం వద్ద ఇసుక బకెట్లు, నీటి వసతి లేదా ఫైర్ ఎక్స్టింగ్విషర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.విద్యుత్ వైరింగ్ విషయంలో కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.రాత్రి 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లౌడ్ డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని ఎస్ఐ మేడ ప్రసాద్ స్పష్టం చేశారు.ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా, వివాదాలకు లేదా ఉద్రిక్తతలకు దారితీసేలా ఉండే పాటలు, నినాదాలను పూర్తిగా నివారించాలని సూచించారు.గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులు, మండపాల నిర్వాహకులు, ప్రజలు పరస్పరం సహకరించుకుంటూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలని ఎస్ఐ కోరారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఉత్సవాలు విజయవంతంగా, ప్రశాంతంగా జరిగేలా మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించి పోలీసు శాఖకు సహకరించాలని ఎస్ఐ మేడ ప్రసాద్ కోరారు

# ఆర్మీ ఆయుధాల చోరీ కేసు చిన్న ఆధారంతో చిక్కిన నిందితుడు



### ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో పోలీసులు వందలాది సీసీటీవీ కెమెరాలు,
### అనుమానితులు, వేలాది సెల్‌ఫోన్ కాల్ డిటైల్ రిపోర్టు విశ్లేషించారు.
### 10 రోజుల పాటు భిన్న కోణాల్లో పోలీసుల బృందాలు దర్యాప్తులో భాగమయ్యాయి.

సికింద్రాబాద్ బొల్లారం కంటోన్మెంట్‌లోని మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్‌లో ఆయుధాల చోరీ కేసును హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సవాలుగా తీసుకుని వ్యవహరించారు. మొదట రెండు రోజులు, తర్వాత ఏడు రోజుల్లో పూర్తి చేస్తామని అనుకుంటే పది రోజులకు పైగా దర్యాప్తు పట్టిందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ కేసులో వందలాది సీసీటీవీ కెమెరాలు, అనుమానితులు, వేలాది సెల్‌ఫోన్ కాల్ రికార్డులను విశ్లేషించారు. గతంలో ఆర్మీలో పని చేసి అనారోగ్యం, క్రమశిక్షణ ఉల్లంఘన కింద ఉద్యోగం కోల్పోయిన మాజీ హవల్దార్ ఉప్పుతోళ్ల మల్లేశ్ అలియాస్ రాజును నిందితుడిగా గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల 31న కేసు నమోదు చేసినప్పటి నుంచి 10 రోజుల పాటు డీజీపీ ఆధ్వర్యంలో పోలీసుల బృందాలు భిన్న కోణాల్లో దర్యాప్తు చేశాయి.

### టెంట్‌లో బస సాంకేతిక ఆధారాల సేకరణ

ఆయుధాలు అపహరణకు గురైన మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్ వద్ద తాత్కాలికంగా పోలీసులు టెంట్ ఏర్పాటు చేశారు. ఆర్మీ, పోలీసు అధికారులు అక్కడే ఉంటూ కేసు దర్యాప్తు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కంటోన్మెంట్ పరిధిలో నివాసాలు, వ్యాపార సముదాయాలు, పోలీసులు ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీని చాలా నిశితంగా విశ్లేషించారు. వందల సంఖ్యలో అనుమానితులను ప్రశ్నించారు. రోజూ 10 నుంచి 12 గంటల పాటు అనుమానితులను ప్రశ్నించటం, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తును కొనసాగిస్తూ చిన్నపాటి ఆధారంతో కేసును పరిష్కరించారు.

### సాంకేతిక ఆధారాలతో అంచనా

ఇటీవల సైన్యం నుంచి తొలగించిన వారు, రిటైర్ అయిన సైనికులు, అధికారులతో ఒక లిస్ట్ తయారు చేశారు. గత నెల 30న ఈ చోరీ జరిగిన సమయంలో వీరంతా ఎక్కడున్నారు ఏం చేస్తున్నారు అనే వివరాలను తెలుసుకున్నారు. వారిలో 10 మంది హైదరాబాద్‌లోనే ఉన్నట్టు సాంకేతిక ఆధారాలతో అంచనాకు వచ్చారు. వారిలో మల్లేశ్ మాత్రం ఆగస్టు నెల 28, 29 తేదీల్లో కంటోన్మెంట్ బొల్లారం పరిసర ప్రాంతాల్లో తిరిగినట్టు సెల్‌ఫోన్ సిగ్నల్స్, సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించారు. అతడి గురించి పూర్తి వివరాలు సేకరించినప్పుడు అసలు విషయం బయటపడింది.

### జంగంరెడ్డిపల్లికి వెళ్లిన టాస్క్‌ఫోర్స్

క్రమశిక్షణ ఉల్లంఘన చర్యలు, అనారోగ్యం కారణంగా అతడిని ఉద్యోగం నుంచి తొలగించినట్టు గుర్తించారు. ఆ ప్రాంతంపై అతనికి పూర్తి అవగాహన ఉండటం, సైనికుల కోడ్ భాషను ప్రయోగించి ఆయుధాలు ఎత్తుకెళ్లినట్లు అంచనాకు వచ్చారు. నిందితుడి సొంతూరు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లికి వెళ్లిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడ సీసీటీవీ కెమెరాలను పరిశీలించాయి. కారులో అనుమానాస్పదంగా తిరిగినట్టు ఫుటేజీలో గుర్తించారు. మల్లేశ్ అసలు సూత్రధారి అనే నిర్ధారణకు వచ్చారు. మల్లేశ్ భార్య సహకారంతో ఎట్టకేలకు ఆయుధాల ఆచూకీని ఛేదించారు.

### చోరీ వెనుక అసలు కారణం

ఆయుధాల చోరీ ఎందుకు చేశావని ప్రశ్నించినప్పుడు మల్లేశ్ తనకు హాలీవుడ్ సినిమాలంటే ఇష్టమని, అదే తరహాలో ఆయుధాలు సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ చోరీకి పాల్పడ్డట్లు చెప్పినట్లు తెలిసింది. తనను ఉద్దేశపూర్వకంగానే తొలగించారనే కోపంతో ఇలా చేశానంటూ మరోసారి బదులిచ్చినట్లు తెలిపారు. ఇంత క్లిష్టమైన కేసును ఛేదించడంలో కీలక భాగమైన హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బందిని డీజీపీ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.

# తక్కువ టైంలో ఎక్కువగా నీరు తాగుతున్నారా..

## వాటర్ ఇంటాక్సికేషన్ అంటే రోజుకు ఎంత వాటర్ తాగాలి



'రోజూ తగినన్ని నీళ్లు తాగండి, అనారోగ్యాలు దరిచేరవు' అని డాక్టర్లు చెబుతుంటారు. నీరు మన శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడమే కాకుండా జీర్ణక్రియ, రక్త ప్రసరణ, శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, మెదడు సక్రమంగా పనిచేయడానికి కీలక పాత్ర పోషిస్తుంది.కానీ, కొంతమంది కళ్లు మూసుకుని గడగడా తగేస్తారు. ఇలా తక్కువ సమయంలో అతిగా నీరు తాగడం ఆరోగ్యానికి ప్రమాదకరమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఒకేసారి అతిగా నీరు తాగడం వల్ల కలిగే పరిణామాలు, అది ఆరోగ్యానికి ఎంత ప్రమాదకరమో ఇప్పుడు తెలుసుకుందాం!

**అతిగా నీరు తాగడం వల్ల :** తక్కువ సమయంలో అతిగా నీరు తాగడం వల్ల రక్తం పలుచన అవుతుంది, శరీరంలోని ఎలక్ట్రోలైట్లు తగ్గుతాయని అధ్యయనం పేర్కొంది. దీనివల్ల 'వాటర్ ఇంటాక్సికేషన్' లేదా 'హైపోనట్రీమియా' అనే తీవ్రమైన పరిస్థితికి దారితీస్తుందని తెలిపింది. ఇలాంటి పరిస్థితిలో శరీర కణాలు నీటితో ఉబ్బిపోతాయి. మెదడుపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది కొన్నిసార్లు ప్రాణాంతకం కూడా కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ ప్రజలలో ఇది అరుదుగా జరిగినప్పటికీ, క్రీడాకారులు, ఎక్కువసేపు వ్యాయామం చేసేవారు లేదా దాహం వేయకపోయినా నిరంతరం నీరు తాగే వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుందని చెబుతున్నారు.

నిద్ర ఎక్కువైనా అనర్థమే - రోజుకు ఎన్ని గంటలు నిద్రించాలి? - పరిశోధనలు ఏం చెప్తున్నాయంటే!

**ఆరోగ్యానికి ఎంత ప్రమాదకరం :** నిరంతరం రంగులేని మూత్రం : శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ నీరు తాగినప్పుడు మూత్రం రంగు కోల్పోయి నీళ్లలా కనిపిస్తుంది. ఇది రక్తం లోని సోడియం వంటి ఎలక్ట్రోలైట్లను తగ్గించి హైపోనాట్రేమియాకు దారితీసే ప్రమాదం ఉంది. లేత పసుపు రంగులో ఉండటం శరీరం సరైన మోతాదులో హైడ్రేటెడ్‌గా ఉందని చెప్పడానికి ఒక సంకేతం.

**కిడ్నీలపై భారం :** కిడ్నీలు గంటకు సుమారు 0.8 నుంచి 1.0 లీటర్ల నీటిని మాత్రమే బయటకు పంపగలవు. అంతకంటే ఎక్కువ తాగితే కిడ్నీలపై అధిక భారం పడుతుందంటున్నారు నిపుణులు. ఎక్కువ నీరు తాగినప్పుడు, కిడ్నీలు అదనపు నీటిని తొలగించలేవని ఋఎశీఎశ్రీఅఆఅఎ అధ్యయనం పేర్కొంది.వికారం, వాంతులు, మైకం : శరీరంలో సోడియం లెవల్స్ తగ్గిపోవడం వల్ల వికారం, వాంతులు, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనిని చాలామంది డీహైడ్రేషన్ అని అనుకుంటారు. కానీ ఇది అతిగా నీరు తాగడం వల్ల వస్తుంది.దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు నీళ్లు అవసరానికి మించి తాగితే కిడ్నీ, గుండెపై ఒత్తిడి పడే అవకాశం ఉంది. ఒకేసారి ఎక్కువ మోతాదులో నీళ్లు తాగితే గుండెకు రక్తం పంప్ కావడం కష్టమవుతుంది. గుండె, ఊపిరితిత్తుల చుట్టూ నీరు చేరడం, చేతులు, కాళ్లు వాపులు వస్తాయి

**మెదడు వాపు కారణంగా తలనొప్పి :** శరీరంలో సోడియం స్థాయిలు తగ్గినప్పుడు మెదడు కణాలలోకి నీరు చేరి అవి వాపునకు గురవుతాయి, దీనివల్ల తీవ్రమైన తలనొప్పి వస్తుంది.

**గందరగోళం, మతిమరుపు :** అధిక నీటి వినియోగం వల్ల మెదడు పనితీరు ప్రభావితమై దృష్టి పెట్టలేకపోవడం, చిరాకు లేదా అలసట కలుగుతాయి.

**చర్మం వాపు :** చేతులు, కాళ్లు, పెదవులు, ముఖం వాపునకు గురవుతాయి. చర్మం వెలవెలబోయినట్లు లేదా సాగినట్లు కనిపిస్తుంది. అలసట, బలహీనత: అదనపు నీటిని బయటకు పంపడానికి కిడ్నీలు ఎక్కువగా శ్రమించడం వల్ల శరీరం అలసిపోయినట్లు అనిపిస్తుంది.

**కండరాల తిమ్మిర్లు :** ఎలక్ట్రోలైట్స్ లోపం వల్ల కండరాలలో తిమ్మిర్లు లేదా నొప్పులు రావచ్చు. ఫిట్స్ వచ్చే ప్రమాదం: తీవ్రమైన పరిస్థితుల్లో సోడియం స్థాయిలు అకస్మాత్తుగా పడిపోయి ఫిట్స్ రావడం లేదా స్పృహ తప్పిపోవడం జరగవచ్చు. తక్కువ వ్యవధిలో అధిక మొత్తంలో నీరు తాగినప్పుడు సంభవించే మెదడు వాపు, మూర్ఛ లాంటి సమస్యలు వస్తాయని ౦ఎఆఅవఅఎవఽఆఅతీవఎ అధ్యయనం పేర్కొంది.

**శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది :**

మెదడు వాపు శ్వాస వ్యవస్థపై ప్రభావం చూపుతుంది, ఇది ప్రాణాంతకంగా మారవచ్చు.

**ఎంత నీరు త్రాగాలి? :**

వయసు, శారీరక శ్రమ, ఆరోగ్య పరిస్థితులతో పాటు ఉష్ణోగ్రతలు, వాతావరణాలపై నీటి మోతాదు ఆధారపడి ఉంటుంది. ఈ క్రమంలో వాతావరణం, ఆహార పద్ధతుల దృష్ట్యా పురుషులు 3 లీటర్లు, మహిళలు 2.2 నుంచి 2.5 లీటర్ల నీళ్లు తాగాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ అధ్యయనం పేర్కొంది. మామూలుగా మహిళలు రోజుకు సగటున 9 కప్పులు, పురుషులు సగటున 13 కప్పుల నీటిని తాగాలని చీ×ం అధ్యయనం పేర్కొంది.

# "ఉదయాన్నే మేల్కొనే గుండెపోటు"

### ఎందుకు అలా జరుగుతుందంటే!

### ఆరోగ్యకరమైన నిద్రతో 'గుండె' పదిలం

### పరిశోధనలు, అధ్యయనాలు తేల్చిందిదే!

ఇంటా బయటా, రాత్రీ, పగలూ ఇలా ఎప్పుడైనా, ఎక్కడైనా గుండెపోటు రావొచ్చు. తీవ్ర ఒత్తిడికి, భావోద్వేగాలకు గురైనప్పుడూ దాడి చేయొచ్చు. దీనికి వేళాపాళా అంటూ ఏమీ ఉండదు. అయితే, చాలామందిలో తెల్లవారుజామున, ఉదయం పూట ఎక్కువగా వస్తుండటం విచిత్రం. ఈ క్రమంలో రాత్రి 11 గంటల కన్నా ఉదయం 9 గంటల సమయంలో గుండెపోటు వచ్చే అవకాశం మూడు రెట్లు ఎక్కువగా ఉందని ఓ పరిశోధనలో తేలింది. ఇందుకు రకరకాల అంశాలు కారణమవుతుంటాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!నిద్రపోయేటప్పుడు శరీరం విశ్రాంతి స్థితిలో ఉంటుంది. మార్నింగ్ మెలకువ వచ్చే టైంకి శరీరాన్ని సన్నద్ధం చేయటానికి అడ్రినలిన్, కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్ల, మోతాదులు పెరుగుతుంటాయి. చురుకుగా, అప్రమత్తంగా ఉండటానికి తోడ్పడే ఇవి గుండె వేగం, బీపీ పెరిగేలా చేస్తుంటాయి. దీంతో గుండె, ధమనుల మీద అదనపు భారం పడుతుందంటున్నారు నిపుణులు. అప్పటికే హైబీపీ, గుండె జబ్బులున్న వారికిది హానికరంగా పరిణమిస్తుందట. రక్త ప్రసరణ సాఫీగా సాగకపోవటం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా, రక్తనాళాల్లో పూడికలు గలవారికి, అవి చిట్లిపోయి ఉదయం వేళల్లో గుండెపోటు ముప్పు ఎక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు.గాయాలైనప్పుడు రక్తం గడ్డకడితే ప్రాణాలు నిలబడతాయి. కానీ, రక్తనాళాల లోపల రక్తం గడ్డలు ఏర్పడితే గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలో సహజంగానే రక్తాన్ని పలుచగా, గడ్డలు కట్టకుండా చూసే వ్యవస్థ ఉంటుందని అంటున్నారు. కాకపోతే, ఇది మార్నింగ్ టైం ప్లేట్‌లెట్లు చురుకుగా పనిచేయటం కారణంగా రక్తం గడ్డకట్టే స్వభావం పెరుగుతుందట. ఇది రక్త ప్రసరణ తీరును దెబ్బతీయడం వల్ల గుండెపోటు వచ్చే





ముప్పు ఎక్కువవుతుంది.రక్తం సాఫీగా సరఫరా కావాలంటే రక్త నాళాలు మృదువుగా, సాగేలా ఉండాలి. ఉదయం పూట రక్తనాళాలు మామూలుగానే బిగువుగా ఉంటాయి. అదే సమయంలో బీపీ కాస్త పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనికి తగినట్టుగా రక్తనాళాలు సాగకపోతే గుండె మీద భారం పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.మార్నింగ్ టైం నీళ్లు బాగానే తాగుతాం. కానీ, రాత్రిపూట మాత్రం తక్కువగా తీసుకుంటాం. కొందరు మధ్యలో మూత్ర విసర్జనకు లేవాల్సి వస్తుందని నీళ్లు తక్కువగా తాగుతారు. ఫలితంగా, శరీరంలో నీటి శాతం తగ్గుతుంది. దీంతో రక్తం పరిమాణం తగ్గుతుందంటున్నారు నిపుణులు. మరోవైపు, రక్తంలో ఉప్పు మోతాదు ఎక్కువై, రక్తం చిక్కబడుతుందని చెబుతున్నారు. ఇలాంటప్పుడు శరీరమంతా రక్తాన్ని సరఫరా చేయటానికి గుండె మరింత బలంగా పని చేయాల్సి వస్తుందట. ఇది గుండెకు ముప్పును తెచ్చిపెడుతుంది.నిద్రలేమి గుండెకు చేటు చేస్తాయి. నిద్రపోతున్నప్పుడు స్లీప్ అప్నియా (కాసేపు శ్వాస ఆగటం), నిద్రలేమి వంటి సమస్యలు కంటి నిండా నిద్ర పట్టకుండా చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో శరీరానికి తగినంత విశ్రాంతి లభించదని అంటున్నారు. అంతేకాదు, శరీరంలో వాపు ప్రక్రియ ప్రేరేపితమై గుండె జబ్బు ముప్పు పెరిగేలా చేస్తుందట. నిద్ర భంగం, నిద్రలేమి సమస్యల వల్ల కుంగుబాటు వంటి మానసిక సమస్యలూ ముంచుకొస్తాయి. ఇవీ గుండెకు అంత మంచిది కాదట. రాత్రిపూట తగినంత నిద్రపోకపోతే తెల్లవారుజామున, ఉదయం పూట గుండె తీవ్ర ఒత్తిడికి లోనై సమస్యాత్మకంగా పరిణమిస్తుంది.కొంతమంది నిద్ర లేవగానే ఎక్సర్‌సైజ్ వంటి శ్రమతో కూడిన పనులు చేస్తుంటారు. మామూలుగా, ఉదయం పూట శరీరం విశ్రాంతి స్థితి నుంచి నెమ్మదిగా కోలుకుంటూ వస్తుంటుంది. ఇలాంటప్పుడు ఉన్నట్టుండి తీవ్రంగా శ్రమ చేసినట్టయితే గుండె మీద అదనపు భారం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

**ముప్పు కారకాలు ఇవీ :** డయాబెటిస్, హైబీపీ, మానసిక ఒత్తిడి, నెలసరి ఆగిపోవటం, స్లీప్ అప్నియా

ప్రశాంతంగా నిద్రపోయేలా చూసుకోవాలి. రాత్రివేళ 7-8 గంటల సేపు గాఢంగా నిద్రిస్తే హార్మోన్ల అస్తవ్యస్తం కావటాన్ని తగ్గించుకోవచ్చు. అలాగే, ఉదయం నిద్ర లేచాక ఓ గ్లాసు నీళ్లు తాగటం మంచిది. కెఫీన్‌తో కూడిన పానీయాలు అతిగా తీసుకోవద్దు. మంచం మీద నుంచి ఉన్నట్టుండి లేవొద్దు. కాసేపు కూర్చోవాలి. కాళ్లు, చేతులు, మెడ, నడుం కదిలించి, సాగదీయాలి

# ఎరుపు రంగు పాలకూరతో ఎన్నో లాభాలు..

## తరచూ తినాల్సిందే..!



మనకు అందుబాటులో ఉన్న అనేక రకాల ఆకుకూరల్లో పాలకూర కూడా ఒకటి. దీన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్న విషయం అందరికీ తెలిసిందే. పాలకూరను తింటే అనేక పోషకాలు కూడా లభిస్తాయి. అయితే పాలకూర పేరు చెప్పగానే ఆకుపచ్చ రంగులో ఉండే ఆకులే ఊహకు వస్తాయి. కానీ మీకు తెలుసా ? ఇందులోనూ అనేక వెరైటీలు ఉన్నాయి. వాటిల్లో ఎర్ర పాలకూర కూడా ఒకటి. ఇది ముదురు ఊదా రంగులోనూ ఉంటుంది. మార్కెట్‌లో మనకు ఈ పాలకూర కూడా లభిస్తుంది. ఎరుపు రంగు పాలకూరలో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. అందుకనే ఆ కూరకు ఎరుపు రంగు వస్తుంది. ఆకుపచ్చ రంగు పాలకూరలాగే ఎరుపు రంగు పాలకూర కూడా మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దీన్ని కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**యాంటీ ఆక్సిడెంట్లు అధికం..**

ఎరుపు రంగు పాలకూరలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇందులో బీటా సయనిన్స్, ఆంథో సయనిన్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆకుపచ్చ పాలకూరలో ఉండవు. అందువల్ల ఎరుపు రంగు పాలకూరను తింటే యాంటీ ఆక్సిడెంట్లను అధిక మొత్తంలో పొందవచ్చు. ఇవి మన శరీరంలో ఉండే ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. వయస్సు మీద పడడం వల్ల వచ్చే వృద్ధాప్య చాయలు తగ్గుతాయి. ముఖంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. దీంతో ముఖం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. ఈ పాలకూరను తింటే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీంతో అంతర్గతంగా ఏర్పడే వాపులు తగ్గుతాయి. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.


**గుండె ఆరోగ్యానికి..**

ఎరుపు రంగు పాలకూరలో నైట్రేట్స్ అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. నైట్రిక్ ఆక్సైడ్ వల్ల రక్త నాళాలపై పడే ఒత్తిడి తగ్గి రక్త నాళాలు ప్రశాంతంగా మారుతాయి. రక్త నాళాలు వెడల్పు అవుతాయి. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల గుండెపై పడే భారం తగ్గుతుంది. ముఖ్యంగా బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు ఈ పాలకూరను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హృదయ సంబంధిత వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. ఈ పాలకూరను తింటే శరీరంలోని కణాలకు ఆక్సిజన్, పోషకాలు సరిగ్గా లభిస్తాయి. దీంతో నీరసం, అలసట తగ్గుతాయి. ఈ పాలకూరను తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి.

**శరీర శక్తి సామర్థ్యాలకు..**

రోజూ శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు ఎరుపు రంగు పాలకూర జ్యూస్‌ను తాగుతుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. దీని వల్ల శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి పొందుతుంది. దీంతో ఉత్సాహంగా మారుతారు. మళ్లీ యాక్టివ్‌గా పనిచేస్తారు. శరీర శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. కండరాలకు మరమ్మత్తులు జరుగుతాయి. కండరాలు త్వరగా కోలుకుని శక్తిని పుంజుకుంటాయి. దీంతో మళ్లీ దృఢంగా మారుతారు. యాక్టివ్‌గా ఉంటారు. ఎరుపు రంగు పాలకూరలో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పాలకూర జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. ఇలా ఎరుపు రంగు పాలకూరతో అనేక లాభాలను పొందవచ్చు. కనుక దీన్ని తరచూ తినాలి.

# బ్రహ్మ ముహూర్తం.. భలే లాభం!



బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేవడం మంచిదని ఇంట్లో పెద్దలు చెబుతారు. ఈ సమయంలో చదివితే బాగా గుర్తుంటుందని బడిలో టీచర్లూ చెబుతుంటారు. సూర్యోదయానికి గంటన్నర ముందు నుంచి 48 నిమిషాల సమయాన్ని బ్రహ్మ ముహూర్తంగా పేర్కొంటారు పెద్దలు. ఈ సమయంలో నిద్ర లేచినంత మాత్రాన అద్భుతాలు జరిగిపోవు. కానీ, ఈ వేళను సమర్థంగా వాడుకుంటే.. బోలెడన్ని ప్రయోజనాలు ఉన్నాయని నిపుణుల మాట. బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేవడం వల్ల పరిసరాల్లో ఎటువంటి అలజడి ఉండదు. చుట్టూ ప్రశాంతంగా ఉంటుంది. రోజు తేలికగా మొదలైందన్న భావన కలుగుతుంది. మానసిక, భౌతిక పరిస్థితులు అనుకూలంగా ఉండటం వల్ల మనసు చదువుపై కేంద్రీకృతం అవుతుంది.ఆయుర్వేద శాస్త్రాల ప్రకారం బ్రహ్మ ముహూర్తంలో లేవడం వల్ల వాత, పిత్త, కఫ దోషాలు తొలగిపోతాయి. దీన్ని అలవాటుగా మార్చుకుంటే జీర్ణక్రియలు సాఫీగా సాగుతాయి. రక్తప్రసరణ మెరుగవుతుంది. రోగనిరోధక వ్యవస్థ అనేకరెట్లు బలపడుతుంది. బ్రహ్మ ముహూర్తంలోనే నిద్రలేచేవాళ్లు సూర్యోదయం తర్వాత ఆరుబయటికి వస్తారు. దీంతో ఉదయకాంతి శరీరంపై ప్రసరిస్తుంది. ఆహ్లాదకరమైన పరిసరాలను చూడటం వల్ల సెరటోనిన్ హార్మోన్ విడుదలవుతుంది. ఈ హార్మోన్ మానసికోల్లాసాన్ని పెంచుతుంది. చికాకు, బెంగ వంటి మానసిక భారాలను తగ్గిస్తుంది. ఆందోళన కూడా తగ్గుతుంది. త్వరగా నిద్ర లేవడం వల్ల తెల్లవారాక వాకింగ్, రన్నింగ్, జాగింగ్ చేయడానికి కావాల్సినంత సమయం ఉంటుంది. అలాగే రోడ్లు, పార్కులు, పరిసరాలు అనుకూలంగా ఉంటాయి. సూర్యోదయ సమయంలో వాహనాల రద్దీ ఉండదు. పరిశ్రమలు మూసి ఉంటాయి. గాలిలో ఆక్సిజన్ అధికంగా ఉంటుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం పెంచుకోవడానికి, దీర్ఘ శ్వాస సాధన చేసేవారికి ఇది అనుకూల సమయం. త్వరగా నిద్రలేవడం వల్ల వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుంది. కాబట్టి రోజువారీ పనులు ముందుగా మొదలుపెడతారు. అలాగే ముందుగానే పూర్తిచేస్తారు. కాబట్టి సక్సెస్ రేటు పెరుగుతుంది.

# తనదాకా వస్తే గానీ..



ఓ మహిళ ఒక రోజు గాంధీజీ వద్దకు వచ్చారట. గాంధీజీతో తన గోడు ఇట్లా వెళ్లబోసుకున్నారట. 'బాపూజీ.. నా కుమారుడు నిత్యం బెల్లం తింటున్నాడు. ఎంత చెప్పినా వినడం లేదు. మీరు చెప్తే వింటాడని మీ వద్దకు తీసుకొచ్చాను' అని ఆమె చెప్పారట. అయితే తనకు ఓ వారం రోజుల సమయం కావాలని ఆమెను గాంధీజీ అడిగారట. అంత వ్యవధి ఎందుకని గాంధీజీని తన అనుచరులు అడిగారట. వారం రోజుల తర్వాత ఆ బాలుడిని పిలిపించి బెల్లం తినొద్దని గాంధీజీ చెప్పి పంపించారట. తనకూ బెల్లం తినే అలవాటు ఉన్నది కాబట్టే, తాను మారిన తర్వాత గానీ ఇతరులకు నీతులు చెప్పొద్దనే ఉద్దేశంతోనే తాను మొదట ఆ బాలునికి దీని గురించి చెప్పలేదని గాంధీజీ తన అనుచరులకు చెప్పారట. అంటే తాను పాటించకుండా ఏ విషయం ఇతరులకు చెప్పొద్దని గాంధీజీనే చెప్పారు. ఇదంతా ఇప్పుడెందుకు అంటే మీడియా గొంతు నొక్కేస్తున్నారని గతంలో చెప్పిన మన ముఖ్యమంత్రి ఇప్పుడు అదే మీడియా విషయంలో, ప్రధానంగా జర్నలిస్టుల విషయంలో వ్యవహరిస్తున్న తీరు గురించి చెప్పేందుకే ఈ ఉపోద్ఘాతం. రాష్ట్ర ముఖ్యమంత్రి తాను విపక్షంలో ఉన్నప్పుడు మీడియా హక్కుల గురించి మాట్లాడారు. జర్నలిస్టులకు అండగా ఉంటానన్నారు. నాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని చెప్పిన ఆయన ఇప్పుడు తనను ప్రశ్నిస్తున్నవారిని అసలు జర్నలిస్టులే కాదంటున్నారు. అంతేకాదు, మీడియా మీట్‌లో ముందు వరుసలో కాలు మీద కాలేసుకొని కూర్చుని తమకు నమస్కారం పెట్టాలనే ధోరణిలో జర్నలిస్టులు ఉంటున్నారని ఎద్దేవా చేస్తూ, అలాంటివారి చెంప చెల్లుమనిపించాలన్నారు. అంతేకాదు, కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులుగా చెలామణి అవుతున్నారని కూడా ఫైరయ్యారు. 'అ ఆ'లు కూడా రానివారు తాము జర్నలిస్టులమ ని చెప్పుకొంటున్నారని సెలవిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ పాలన గురించి సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని కొందరి చేత పనిగట్టుకుని దుష్ప్రచారం చేయించిన ఆయనకు నాటి మీడియా ఎంతో నచ్చింది. అప్పట్లో ఏ ఆధారాలు లేకుండానే బురదజల్లిన ప్రస్తుత అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రస్తుత ముఖ్యమంత్రి సహా నాడు వాటిని ప్రసారం చేసిన జర్నలిస్టు సమూహాల గురించి ఆహా ఓహో అంటూ కొనియాడారు. కానీ, ప్రస్తుతం అధికారంలోకి రాగానే అవే వేళ్లు తన వైపునకు చూపేసరికి అసెంబ్లీ సాక్షిగా బట్టలూడదీసి జర్నలిస్టులను కొట్టాలంటున్నారు. తమ సమస్యలను చెప్పుకోవడానికి ఒక వేదికగా నిలిచే ప్రెస్ క్లబ్‌ను కల్లు కాంపౌండ్, పబ్బులతో పోల్చడం ముఖ్యమంత్రికే చెల్లింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భానికి ముందు కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై తమ ఇష్టానుసారంగా మాట్లాడారు. అప్పుడు సంతోషపడిన ఇదే సీఎం, ఇప్పుడు కస్సుబుస్సులాడుతున్నారు. తన దాకా వస్తే ఇలా ఉంటుం దా? కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులు, మీలాంటి రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం పనిచేస్తే జర్నలిస్టు సమాజమంతా తప్పు చేసినట్టు మాట్లాడటం, చులకనభావంతో చూడ టం సరికాదు. జర్నలిస్టులు అనేవాళ్లను సమాజంలో చెడుగా చూపించే ప్రయత్నాన్ని మీరు పనిగట్టుకుని చేయడాన్ని జర్నలిస్టులు గాని, జర్నలిస్టు సంఘాలు గాని సహించవు. మన సీఎం మాత్రమే కాదు, ఆయన పాత మిత్రులు, ఆ మిత్రులకు తోడైన కొందరు కొత్త మిత్రులు.. అందరూ మీడియాపై విరుచుకు పడుతున్నవారే. ఎటొచ్చి జర్నలిస్టులే ఎటూ కాకుండాపోతున్నారు. రాహుల్‌గాంధీ నిత్యం ప్రజాస్వామ్యం గురించి, భావప్రకటనా స్వేచ్ఛ గురించి మాట్లాడుతున్నారు. చేతిలో రాజ్యాం గం పుస్తకాన్ని పట్టుకొని తిరిగే ఆయనకు ఆ రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19(1)(ఏ) భావప్రకటనాస్వేచ్ఛ గురించి బాగా తెలుసు కాబట్టి, మీడియాకు స్వేచ్ఛ ఉండాలని కోరుకుంటున్నారు. తన గురించి ఎవ్వరు , ఏం మాట్లాడినా ఫర్వాలేదంటున్నారు. తనకు నచ్చిన విధంగా ముందుకెళ్తానని చెప్తున్నారు. కానీ, మన సీఎం మాత్రం, వాళ్ల అధినాయకుడి బాట కు భిన్నంగా వ్యవహరిస్తున్నట్టు స్పష్టంగా అర్థమవుతున్నది. ఏడాదిన్నరలోనే తమను ప్రశ్నించిన జర్నలిస్టులపై ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో మన కండ్లముందున్నది. ఒక చెం ప కొడితే మరో చెంప చూపించాలనే గాంధీజీ సిద్ధాంతాన్ని కాంగ్రెస్ పార్టీ ఏనాడో గాలికి వదిలేసింది. అయితే మన ముఖ్యమంత్రి గాంధేయ మార్గంలో నడుస్తున్నానని బయటకు చెప్తూనే అనేక చోట్ల ఆవేశంతో మాట్లాడే మాట లు యథావిధిగా మీడియా ప్రసారం చేస్తే మాత్రం సదరు ముఖ్యమంత్రికి చిర్రెత్తుకొస్తుంది. పలు సభల్లో ఆయన మాట్లాడుతూ పేగులు మెడలో వేసుకుంటానని, బట్టలూడదీసి కొడతానన్నారు. ఆ మాటలను యథావిధిగా ప్రసారం చేస్తే జర్నలిస్టులపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వ పాలన జనరంజకంగా ఉంటే జర్నలిస్టులు అదే విషయాన్ని రాస్తారు. లేదు, ప్రజా కంటకంగా పాలన సాగుతుంటే దానిని ప్రశ్నల రూపంలో సంధించి పాలకులకు తెలిసివచ్చేలా చేస్తుంటా రు. పాలకులనేవారు సద్విమర్శలను, సూచన రూపంలో వచ్చే వార్తలను అనుకూల దృక్పథంతో తీసుకోవాలి. అంతేకానీ, మీడియా సం స్థలు తమకు బాకా ఊదాలని, ఇంద్రుడు చం ద్రుడు అని పొగడాలని, తాము ఏం చేసినా ఏ నిర్ణయం తీసుకున్నా అదే సరైనదన్న రీతిలో వార్తలు కవర్ చేయాలని భావించడం పెద్ద తప్పు. తమ తప్పులను సరిచేసుకోకుండా మీడియాపైనా, జర్నలిస్టులపైనా విరుచుకుపడటం ఈ మధ్య ప్రతీ ఒక్కరికి ఫ్యాషన్‌గా మారింది. ఏ విభాగంలోనైనా ఒక్కరో, ఇద్దరో తప్పులు చేస్తుంటారు, అంతమాత్రాన మొత్తం ఆ విభాగానికే అంటగట్టడం, తక్కువ చేసి మాట్లాడటం ఏలికలకు తగదు. సమాజంలో గౌరవప్రదమైన వృత్తిగా భావించే జర్నలిజం, ఆ వృత్తిని ఆధారంగా చేసుకొని జీవిస్తున్న జర్నలిస్టులపై చులకనాభావం తగదు. రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛకు రాజకీయులు ప్రతిబంధకాలుగా మారడం మంచిది కాదు.



## ట్రైలర్ లేదు.. నేరుగా థియేటర్లోనే సాలిడ్ హైప్ ఇస్తాం..!

భారీ అంచనాలతో తెరకెక్కిన యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' (ష్త్రవ్యాఖుతీఖు౹అంవ) సినిమా ట్రైలర్ లేకుండానే విడుదలవ్వనుంది. గత కొన్ని రోజులుగా మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ వార్తను హీరో, నేచురల్ స్టార్ నాని ధ్రువీకరించారు. శుక్రవారం మీడియాతో చిట్‌చాట్‌లో ట్రైలర్ లేకుండానే వస్తున్నామని, నేరుగా థియేటర్‌లోనే ప్రేక్షకులకు, అభిమానులకు సాలిడ్ హైప్ ఇచ్చి ఇంటికి పంపిస్తామని నాని తెలిపారు. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలున్నాయి. ఇప్పటికే 'ఆయా షేర్', 'యేష నాగుల కట్ట' పాటలు నెట్టింట వైరలవుతుండగా.. మునుపెన్నడూ లేనివిధంగా జడల గెటప్‌లో నాని పూనకాలు తెప్పించడం ఖాయమనిస్తోంది. అందుకని.. సినిమాలోని సస్పెన్స్‌ను మెయింటైన్ చేయడంతో పాటు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచడానికి ట్రైలర్ లేకుండానే సినిమాను నేరుగా థియేటర్లలోకి తీసుకురావాలని చిత్రబృందం నిర్ణయించింది. ఈ విషయాన్ని హీరో నాని అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం మీడియాతో చిట్‌చాట్‌లో దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో కలిసి మాట్లాడిన నాని సినిమాలో తన జడల లుక్, వెయ్యి మందితో ఫైట్ వార్తలపై స్పష్టత నిచ్చారు. ఆన్‌లైన్‌లో, మీడియాలో ప్రచారం అవుతున్నట్టు.. నీళ్ల అడుగున ఫైట్ లేదని.. 1000 మందితో కూడా ఫైట్ సీన్ లేదని నేచురల్ స్టార్ వెల్లడించారు. అంతేకాదు.. 'సినిమాలో మీ జడల బరువు 6 కేజీలు ఉందా?' అనే ప్రశ్నకు నవ్విన నాని.. 'అంత బరువు లేదండి' అని చెప్పారు. ఈ చిత్రంలో ఒక్క ఫ్రేమ్ కూడా బోర్ కొట్టించదని పేర్కొన్న ఆయన.. సినిమా ఇంత బాగా రావడానికి యూనిట్‌లోని ప్రతిఒక్కరూ చెమటోడ్చారని తెలిపారు. స్క్రీన్ మీద ప్రతి సీన్‌లో టెక్నీషియన్ల కష్టం కనిపిస్తుందని ఆయన అన్నారు. షూటింగ్‌లో తనతో పాటు క్యారెక్టర్ ఆర్టిస్టులు కూడా గాయపడ్డారని, కానీ.. తన గాయాల గురించే మీడియాలో వార్తలు వచ్చాయని స్పష్టం చేశారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలవ్వనుంది.

## తెలుగులోకి 'హనుమాన్ అంశ్'.. సెప్టెంబర్ 18న గ్రాండ్ రిలీజ్!




ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవితాధారంగా తెరకెక్కిన సంచలన హిందీ భక్తిరస చిత్రం 'హనుమాన్ అంశ్' ఇప్పుడు అధికారికంగా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఎలాంటి భారీ అంచనాలు లేకుండా కేవలం రూ.2 కోట్ల చిన్న బడ్జెట్‌తో విడుదలై, బాక్సాఫీస్ వద్ద వంద కోట్ల రూపాయలకు పైగా వసూళ్లతో అఖండ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని తెలుగులో సమర్పిస్తుండగా, ఫార్చున్ ఫోర్ సినిమాస్ సంస్థ తెలుగు థియేట్రికల్ విడుదలను చేపట్టింది. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శోభినావ్ సత్య, విహాన్ శెడ్గే ప్రధాన పాత్రల్లో నటించారు. నీమ్ కరోలి బాబా భక్తుల భావోద్వేగాలను, ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను కూడా ఎంతగానో ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 18న అత్యంత భారీ స్థాయిలో తెలుగు తెరపైకి రానుంది.

## ప్రభాస్ 'ఫౌజీ' వాయిదా .. ఆ డేట్‌పై ఎన్ని సినిమాలు కన్నేసాయో తెలుసా?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'ఫౌజీ'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ గతంలోనే ప్రకటించారు. అయితే సినిమా షూటింగ్ ఇంకా పూర్తికాకపోవడంతో అనుకున్న తేదీకి 'ఫౌజీ' వస్తుందా? అనే చర్చ మొదలైంది. 'ఫౌజీ' చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రభాస్ కూడా సినిమాకు భారీగా కాల్షీట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. ఒకేసారి రెండు, మూడు చిత్రీకరణ బృందాలతో షూటింగ్ నిర్వహిస్తూ పనులను వేగంగా పూర్తి చేస్తున్నారని టాక్. సినిమాను డిసెంబర్ 3న విడుదల చేయాలనే విషయంలో చిత్రబృందం మాత్రం పూర్తి నమ్మకంతో ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ నిర్మాణ పనులు, మిగిలిన చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్ పనులను దృష్టిలో పెట్టుకుని విడుదల తేదీపై పరిశ్రమ వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఒకవేళ 'ఫౌజీ' డిసెంబర్ మొదటి వారంలో విడుదల కాకపోతే.. ఆ ఖాళీని భర్తీ చేసేందుకు ఇప్పటికే కొన్ని సినిమాలు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.వాటిలో ముందుగా చెప్పుకోవాల్సింది విశ్వక్ సేన్ నటిస్తున్న 'లెగసీ'. పొలిటికల్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాను డిసెంబర్ 4న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీంతో డిసెంబర్ మొదటి వారంలో తన స్థానాన్ని ఈ సినిమా ముందుగానే ఖరారు చేసుకుంది. మరోవైపు దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే జంటగా నటిస్తున్న 'శ్రీ శ్రీ' సినిమా కూడా డిసెంబర్ మొదటి వారంలో విడుదలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.అలాగే యువ సామ్రాట్ నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వృషకర్మ' డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రభాస్ లాంటి భారీ పాన్ ఇండియా స్టార్ సినిమా అదే సమయంలో విడుదలకు సిద్ధంగా ఉంటే.. విశ్వక్ సేన్, దుల్కర్ సల్మాన్, నాగచైతన్య సినిమాల నిర్మాతలు డిసెంబర్ మొదటి వారాన్ని ఎంచుకునే విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించేవారు. కాని ఆయన తప్పుకోవడంతో వీరు రేసులోకి వచ్చారు. 'ఫౌజీ' డిసెంబర్ నుంచి తప్పుకుంటే.. వచ్చే ఏడాది వేసవికి వస్తుందా అనే చర్చ కూడా ఇండస్ట్రీలో నడుస్తుంది.

## సంయుక్త మీనన్ బర్త్ డే టీజర్ విడుదల.. వీరనారి అవతారం లుక్‌కు ఫిదా అవుతున్న ఫ్యాన్స్!




నిఖిల్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో సంయుక్త, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం దాదాపు రెండేళ్లుగా షూటింగ్ జరుపుకుని ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఈ రోజు సంయుక్త మీనన్ బర్త్ డే సందర్భంగా 40 సెకన్ల టీజర్ విడుదల చేశారు. ఇందులో వీరనారి పాత్రలో సంయుక్త కనిపించిన తీరు, కత్తి యుద్ధాలు చేసిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇప్పటివరకు గ్లామర్, ఎమోషనల్ పాత్రల్లో కనిపించిన సంయుక్త.. 'స్వయంభు'లో మాత్రం పూర్తి భిన్నమైన అవతారంలో కనిపించబోతున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. 'స్వయంభు' కథ చారిత్రక నేపథ్యంలో సాగనున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతోంది. రాజ్యాలు, అంతర్యుద్ధాలు, ప్రజలను కాపాడేందుకు జరిగే పోరాటాలు, వీరత్వంతో కూడిన సన్నివేశాలతో సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో సంయుక్త పోషిస్తున్న పాత్రకు కూడా కథలో కీలకం కానుంది. చేతిలో కత్తి పట్టుకుని యుద్ధరంగంలో పోరాడుతున్న ఆమె సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీరనారి గెటప్‌లో సంయుక్త లుక్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. మరో హీరోయిన్ నభా నటేశ్ కూడా ఈ సినిమాలో యువరాణి పాత్రలో కనిపించనుంది. ఆ మధ్య విడుదలైన టీజర్‌లో ఆమె లుక్ కూడా రాజసం ఉట్టిపడేలా ఉంది. చారిత్రక నేపథ్యానికి తగ్గట్టుగా రూపొందించిన సెట్స్, వస్త్రధారణ, పాత్రల లుక్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. నిఖిల్ కూడా తన కెరీర్‌లో ఇంతకు ముందు చేయని తరహా పాత్రలో కనిపించనున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఉన్నట్లు కనిపిస్తోంది. కమెడియన్ సునీల్ ఈ సినిమాలో పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఆయన పాత్ర ఎలా ఉండబోతుందనేది ఆసక్తిని కలిగిస్తోంది. చారిత్రక నేపథ్యానికి భారీ యాక్షన్, విజువల్స్, డ్రామాను జోడించి సినిమాను రూపొందించినట్లు కనిపిస్తోంది.

## వెంకీ - త్రివిక్రమ్ మూవీ అప్‌డేట్.. రేపు 'ఆదర్శ కుటుంబం' టీజర్!

టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47 / ాూఖ 47) సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ సోషల్ మీడియాలో కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను రేపు మధ్యాహ్నం 12:00 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. "నువ్వు నాకు నచ్చావ్", "మల్లీశ్వరి" వంటి క్లాసిక్ ఫ్యామిలీ హిట్స్ అందించిన త్రివిక్రమ్ మాటలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై సినీ వర్గాల్లోనూ, అభిమానుల్లోనూ విపరీతమైన క్రేజ్ ఉంది.

SRI MAMATHA PRESENTS HAARIKA & HASSINE CREATIONS




PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040